అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com




సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:123 | హైదరాబాద్ 04 డిసెంబర్ 2025, గురువారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-123 | Hyderabad 04 December 2025, Thursday | Pages: 8, Rs. 5/-



అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com

## ఐదంచెల భద్రత

### నేడు భారత్‌కు రానున్న రష్యా అధ్యక్షుడికి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటన సందర్భంగా న్యూఢిల్లీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పుతిన్ గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో పుతిన్‌కు ఐదంచెల అభేద్యమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భద్రతలో రష్యా అధ్యక్షుడి సిబ్బందితో పాటు, భారత ఎన్ఎస్‌జీ కమాండోలు, స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానిటరింగ్ వ్యవస్థలను మోహరించారు. ఇప్పటికే రష్యాకు చెందిన 48 మంది ఉన్నత స్థాయి భద్రతా సిబ్బంది ఢిల్లీకి చేరుకున్నారు. పుతిన్ భద్రతలో బయటి వలయాల బాధ్యతను ఎన్ఎస్‌జీ, ఢిల్లీ పోలీసులు చూసుకుంటారు.

...::: తరువాయి 3వ పేజీలో..

## మోదీ పై ఏఐ వీడియో



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అవమానించేలా కాంగ్రెస్ పార్టీ ఒక ఏఐ (AI) జనరేటెడ్ వీడియోను సోషల్ మీడియాలో బుధవారం పోస్టు చేయడం వివాదాస్పదమైంది. ఈ వీడియోలో ప్రధానమంత్రి మోదీ లేత నీలం కోటు, నల్ల ప్యాంటులో కనిపిస్తూ, కెటిల్, టీ గ్లాసులు పట్టుకుని, త్రివర్ణ పతాకం ఉన్న కార్పెట్ మీద టీ అమ్ముతున్నట్లు చూపించారు. వైరల్ అయిన ఈ ఏఐ వీడియోపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ నాయకురాలు రాగిణి నాయక్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వీడియోను మొదట షేర్ చేసి, వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. వీడియో ఏఐ సాయంతో రూపొందించారనేది స్పష్టంగా తెలుస్తోంది. రేణుకా చౌదరి పార్లమెంట్ ను, సైన్యాన్ని అవమానించిన తర్వాత, రాగిణి నాయక్ మోడీని అపహాస్యం చేశారని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఓబీసీ కమ్యూనిటీకి చెందిన కష్టపడి పనిచేసే ప్రధానమంత్రిని కాంగ్రెస్ అంగీకరించలేకపోతోందని, ఆయన 'చాయ్ వాలా' నేపథ్యాన్ని లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని వారు విమర్శించారు.


...::: తరువాయి 2వ పేజీలో..



## చంద్రబాబుతో అదానీ

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో బుధవారం భేటీ అయ్యారు. ప్రత్యేక విమానంలో విజయవాడ ఎయిర్‌పోర్ట్ కు చేరుకున్న ఆయన, అక్కడి నుంచి చంద్రబాబు నివాసానికి వెళ్లి పలు అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో ఏపీలో పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు జరిగాయి. గౌతం అదానీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ విశాఖలో జరిగిన ఇన్వెస్టర్ సమ్మిట్‌లో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను ప్రకటించారు. రాబోయే 10 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులు, సిమెంట్, డేటా సెంటర్లు, ఎనర్జీ, అడ్వాన్స్ డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి రంగాల్లో అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు.అదే సమయంలో, విశాఖలో గూగుల్ ఏఐ హబ్ నిర్మాణంలో అదానీ గ్రూప్ పాలుపంచుకుంటోంది. ఈ అంశాలపై భేటీలో చర్చ జరిగిందని తెలుస్తోంది. కానీ ఈ భేటీ గురించి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.




### భారత్ పై బంగ్లాదేశ్ ఆర్మీ మాజీ జనరల్

## అజ్మీ కారుకూతలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారతదేశం ముక్కలు కానంత వరకు బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొనదని బంగ్లాదేశ్ ఆర్మీ మాజీ జనరల్ అబ్దుల్లాహిల్ అమాన్ అజ్మీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నందు వల్ల, రెండు దేశాల మధ్య సంబంధాలు బలహీనపడుతున్నాయని ఆయన అన్నారు. ఆయన వ్యాఖ్యలతో భారత ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వెల్లువెత్తింది. నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో ఆయనపై మండిపడుతున్నారు. బంగ్లాదేశ్ విముక్తికి భారత్ చేసిన సహాయాన్ని మరిచి, ఆ దేశ నాయకులు విషం చిమ్మడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. తాత్కాలిక ప్రభుత్వంతో సంబంధాలు తిరిగి పునరుద్ధరించుకోవడానికి భారత్ ప్రయత్నిస్తున్న సమయంలో, అమాన్ అజ్మీ చేసిన వ్యాఖ్యలు సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### 78 ఏళ్ల జర్నీలో రూపాయికి ఎదురైన చేదు అనుభవాలు


### 2008, 2013, 2020లలో బాగా బలహీన పడ్డ రూపాయి...

### పెట్టుబడుల ఉపసంహరణ పుట్టి ముంచింది!

# డాలర్ గుప్పెట్లో... రూపాయి

### ఇందిరాగాంధీ హయాంలో పెద్ద డీవాల్యుయేషన్

### రూపాయి నడ్డి విరిచిన అమెరికా వడ్డీ రేట్లు



ఇది నా కథ.... అవును.. నా కథే... భారత దేశంలో నన్ను ప్రేమగా రూపాయి అని పిలుస్తుంటారు ... సిపాయి తర్వాత ఈ దేశంలో నాకే ఎక్కువ గౌరవం దక్కుతుంది. కుల, మత, భాష, ప్రాంతాలకు అతీతంగా అందరి ఇళ్లల్లో, జేబుల్లో నేను పాత, కొత్త రూపాలలో దేశ ప్రజలందరినీ అలరిస్తుంటాను. అలాంటి నాకు పుట్టెడు కష్టమొచ్చింది. ఒక్క సారిగా నా పతనం నా కళ్ల ముందు కదలాడుతుంటే, పాత సంగతులన్నీ గుర్తొస్తున్నాయి. అవి మీతో పంచుకుంటే, నా భారం దిగుతుందేమోనని అనిపిస్తోంది. అందుకే నా లైఫ్ జర్నీ గురించి కాస్త వివరిస్తా.... ఓపిక చేసుకుని చదవండి ...

...::: సమగ్ర కథనం 2వ పేజీలో..



### ఇండిగో ఇక్కట్లు...

## ప్రయాణికుల అగచాట్లు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఇండిగోలో సాంకేతిక లోపాలు, ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్.డి.టి.ఎల్) నిబంధనల వల్ల ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు సహా ప్రధాన విమానాశ్రయాల్లో వందలాది విమానాలు బుధవారం రద్దయ్యాయి. విమానాలు రద్దుకావడంతో వేలాది మంది ప్రయాణికులు గంటల తరబడి విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. బుధవారం మధ్యాహ్నం వరకు మొత్తం 200 విమానాలు రద్దయినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక్కరోజులోనే 33 ఇండిగో విమానాలు రద్దయ్యాయి. ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయంలో 51 కంటే ఎక్కువ విమానాలు రద్దయ్యాయి. హైదరాబాద్‌లో మొత్తం 19 ఇండిగో విమానాలు రద్దయినట్లు విమానాశ్రయ అధికారులు నిర్ధారించారు. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కూడా, ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

...::: తరువాయి 2వ పేజీలో..



# పదేళ్లూ నేనే సీఎం

### 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా అవతరణ

### దేవుళ్లపై తాను చేసిన వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరిస్తోందని సీఎం ఆరోపణ

**తెలంగాణకు రెండో పర్యాయం కూడా ముఖ్యమంత్రిగా తానే ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా అక్కడ మీడియా ప్రతినిధులతో బుధవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఎలా సహాయం చేశారో ఇప్పుడూ అదే తరహాలో తమ రాష్ట్రానికి సాయం చేయాలని విజ్ఞప్తి చేసినట్లుగా రేవంత్ రెడ్డి చెప్పారు.**

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

దేవుళ్లపై తాను చేసిన వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా బీజేపీ వివాదాస్పదం చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుల సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలు, పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమని చెప్పే ప్రయత్నంలో భాగమేనని ఆయన పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుల నియామకాలు, చిన్న వయసు వారికి అవకాశం కల్పించడంతో వారికి పార్టీ పరిస్థితుల గురించి వివరించానని పేర్కొన్నారు. "పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉండడం సహజం. ఒకరు వెంకటేశ్వరుడిని పూజిస్తారు, మరొకరు హనుమంతుడిని. దేవతలపై ఏ భిన్నాభిప్రాయం రాలేదు కదా... రాజకీయ నాయకులు, డీసీసీ అధ్యక్షులపై ఎలా వస్తుందని," ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హిందూ సమాజం లాంటిదని ఆయన అభివర్ణించారు.

### సర్పంచ్ పదవి కోసం


## అమెరికాకు గుడ్ బై...



**నాగర్ కర్నూల్ (ఏడీఎన్ఎన్) :**

సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక మహిళ అమెరికా నుంచి వచ్చింది. నాగర్ కర్నూల్ జిల్లా లట్టుపల్లిలో సర్పంచ్ స్థానం మహిళకు రిజర్వ్ కావడంతో ఆమె హుటాహుటిన అమెరికా నుంచి వచ్చి నామినేషన్ దాఖలు చేసింది. తనను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని చెబుతోంది. గ్రామ అభివృద్ధి కోసం పని చేయాలన్న సంకల్పంతో అమెరికాలో ఉన్న తన జీవితం మధ్యలో వదిలేసి స్వగ్రామానికి వచ్చి నామినేషన్ దాఖలు చేసింది . నందిని రెడ్డి గృహిణి. ఆమె భర్త శ్రీనివాస్ రెడ్డి పోస్టల్ శాఖలో పనిచేస్తున్నారు. సాధారణ కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ, చిన్నప్పటి నుంచే రాజకీయల పట్ల నందిని ఆసక్తి చూపించేదని గ్రామస్థులు చెప్పటం విశేషం.

...::: తరువాయి 5వ పేజీలో..



### బీజాపూర్ లో భారీ ఎన్ కౌంటర్

## 12 మంది మృతి

**ఛత్తీస్‌గఢ్ (ఏడీఎన్ఎన్) :**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య బుధవారం జరిగిన హోరాహోరీగా ఎదురుకాల్పులలో 12 మంది మావోయిస్టులు, ఇద్దరు జవాన్లు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి మావోల మృతదేహాలతోపాటు, భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలతో పాటు ఇతర సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ , కోబ్రా బలగాలు సంయుక్తంగా ఈ యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపట్టాయి. తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో, మరోవైపు బీజాపూర్ బైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేస్‌కుతుల్ అటవీ ప్రాంతంలో ఆపరేషన్ కగార్ లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల సమయంలో కాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్ లో డీఆర్‌జీ బీజాపూర్, దంతెవాడా బలగాలు, ఎస్టీఎఫ్ బృందాలు పాల్గొన్నాయని బీజాపూర్ ఎస్పీ జీతేందర్ యాదవ్ తెలిపారు.

...::: తరువాయి 2వ పేజీలో..

62

## వందేళ్ల... ఆర్ఎస్ఎస్

### భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం

### డిజిటల్ యుగంలో ధర్మ ధ్వజం: సోషల్ మీడియాలో సంఘ్ శంఖారావం

### సంప్రదాయాన్ని వదలకుండా సాంకేతికతను శాసిస్తున్న ఆధునిక జాతీయ శక్తి



ప్రపంచ చరిత్రను గమనిస్తే, ఏ సంస్థ అయితే కాలానుగుణంగా తనను తాను మార్చుకోలేకపోయిందో, ఏ ఉద్యమం అయితే నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో విఫలమైందో, అది కాలగర్భంలో కలిసిపోయింది. కానీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) వందేళ్ళ ప్రస్థానం ఈ సిద్ధాంతానికి ఒక అద్భుతమైన మినహాయింపు. ఒక సజీవమైన ఉదాహరణ.

99 ఏళ్ల క్రితం, నాగ్‌పూర్‌లోని ఒక చిన్న మైదానంలో, మట్టిలో ఆడుకుంటూ, కర్ర సాము చేస్తూ ప్రారంభమైన ఈ సంస్థ, నేడు డిజిటల్ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎలా ఎదిగింది? చేతిలో దండం (కర్ర) పట్టుకున్న స్వయంసేవకుడు, అదే చేతితో స్మార్ట్‌ఫోన్‌ను, ల్యాప్‌టాప్‌ను పట్టుకుని, సోషల్ మీడియాలో జాతీయవాద భావజాలాన్ని ఎలా ప్రచారం చేస్తున్నాడు? అనేది ఒక ఆసక్తికరమైన, స్ఫూర్తిదాయకమైన పరిణామ క్రమం. సాధారణంగా సంఘ్ అంటే పాతకాలపు పద్ధతులు, సంప్రదాయవాదం, ఆధునికతకు దూరం అనే అపోహ ఒకప్పుడు ఉండేది. కానీ, నేడు సంఘ్ అంటే 'టెక్‌సావీ' (TechSavvy). సంఘ్ అంటే డిజిటల్ ఆర్గనైజేషన్. ఫేస్‌బుక్, ట్విట్టర్ (X), ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్... వేదిక ఏదైనా సరే, అక్కడ సంఘ్ స్వయంసేవకుల ఉనికి, వారి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

ఇది కేవలం ప్రచారం కోసం చేస్తున్న ఆర్భాటం కాదు. ఇది "యుగానుకూల పరివర్తన" (Transformation according to the Era). సమాచారం ఒక ఆయుధంగా మారిన ఈ 'ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్' (Information Warfare) యుగంలో, జాతి వ్యతిరేక శక్తులు సోషల్ మీడియాను ఉపయోగించి దేశంపై విషం చిమ్ముతున్నప్పుడు, అదే మాధ్యమాన్ని ఒక రక్షా కవచంగా, ఒక ప్రతిదాడి అస్త్రంగా మలచుకున్న ఘనత సంఘ్‌ది.

...::: తరువాయి 2వ పేజీలో..



## మనల్ని ఎవడ్రా ఆపేది

### తెలంగాణ మంత్రులకు జనసేన నాయకుల హెచ్చరికలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై తెలంగాణ మంత్రుల చేస్తున్న హెచ్చరికలపై ఏపీ జనసేన నేతలు ధీటుగా స్పందించారు. పవన్ కళ్యాణ్ సినిమాలను కాదు కదా, ఆయన వెంట్రుక కూడా కదిలించలేరంటూ జనసేన ముఖ్య నేతలు బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మంత్రుల వ్యాఖ్యలపై కాకినాడ జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ఆంధ్రులు అన్ని విధాలుగా నష్టపోయాము. మా కొబ్బరిచెట్లు చనిపోయాయంటే, అది మా బాధ, మా సమస్య. దానిని వక్రీకరించి పవన్ కళ్యాణ్‌పై ఇష్టానుసారం మాట్లాడితే, ఆంధ్రులంతా ఒకటవుతాం" అంటూ ఆయన తెలంగాణ మంత్రులను హెచ్చరించారు. కొబ్బరి చెట్లకు దిష్టి తగిలిందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయాలతో పాటు సినీ వర్గాల్లోనూ తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రుల నుంచి వస్తున్న తీవ్ర విమర్శల నేపథ్యంలో, ఏపీ జనసేన నాయకులు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. పవన్ కళ్యాణ్‌కు రాజకీయ అనుభవం లేదంటూ తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన సినిమాలు తెలంగాణలో ఒకటి రెండు రోజులకు మించి ఆడనివ్వమంటూ హెచ్చరించారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ నాయకులతో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, వామపక్షాల నేతలు కూడా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి పనికిరారని విమర్శిస్తున్నారు.



### మూడో విడత

## భూ సమీకరణకు సై

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

అమరావతి సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం మూడో విడత భూ సేకరణపై కసరత్తు చేస్తోందని మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ బుధవారం వెల్లడించారు. ఇప్పటికే మొదటి విడతలో రైతుల నుంచి 34,000 ఎకరాలు సేకరించారు . రెండో విడతలో రైతుల నుంచి 16 వేలకు ఎకరాలకు పైగా భూముల సేకరణకు ఇటీవలే నోటిఫికేషన్ ఇచ్చింది. రెండో విడతలో ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్ ఏర్పాట్ల పనులు కొనసాగుతున్నాయని, మూడో విడత భూ సమీకరణ అంశంపై త్వరలోనే పూర్తి స్పష్టత ఇస్తామని మంత్రి తెలిపారు. అమరావతిని 227 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 30 శాతం 'గ్రీన్ & బ్లూ' ఏరియాగా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌లో ఏర్పాటు చేసిన 22 రోడ్లకు రెండువైపులా గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులు చేపడుతున్నామని చెప్పారు. 190 ఎకరాల్లో శాఖమూరు పార్క్ సిద్ధమవుతోందని, అలాగే 200 ఎకరాల్లో బయో డైవర్సిటీ పార్కును ఏర్పాటు చేసే పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీంతో పాటు, కృష్ణాయపాలెం , నీరుకొండ వద్ద ఉన్న రిజర్వాయర్ల బ్యూటిఫికేషన్ పనులు కూడా జరుగుతున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. శాఖమూరు పార్కులో అమ్యూజ్‌మెంట్ పార్కుకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా, పిల్లల కోసం స్నో వరల్డ్, అడ్వెంచర్ పార్క్ వంటి విభాగాలు అందుబాటులోకి రానున్నాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ పార్కులో 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, మరో ముఖ్య ఆకర్షణగా, 20 ఎకరాల విస్తీర్ణంలో దశావతార ఫ్లవర్ గార్డెన్‌ను కూడా ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.

మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
04.12.2025
www.manasarkar.com

# డాలర్ గుప్పెట్లో... రూపాయి



మొదటి పేజీ తరువాయి...

రూపాయి-డాలర్ మారకాల ప్రయాణం గురించి మాట్లాడితే, అబ్బో చాలా పెద్ద కథ.. రూపాయి పతనం అనేది కేవలం సంఖ్యల కథ కాదు — ఇది దేశ ఆర్థిక మార్పులు, ప్రపంచ సంఘటనలు, రాజకీయ నిర్ణయాలు, ప్రజల ఆశలు-ఆందోళనలతో ముడిపడిన దీర్ఘ ప్రయాణం. ప్రతి దశలో రూపాయి ఎక్కడ నిలబడిందో, ఎందుకు కదిలిందో అర్థం చేసుకుంటే, రూపాయిగా నేను పడ్డ కష్టమేంటో మీకు కూడా తెలుస్తుంది ... ముందుగా 1947 నుంచి 1965 మధ్య కాలంలో, అంటే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రూపాయి విలువపై అప్పటి లెక్కలు భిన్నంగా ఉన్నాయి. కొందరు 1 డాలర్ విలువ రూ.3.30 అని చెపితే, మరికొందరు 1 డాలర్ విలువ రూ.4గా అంచనా వేస్తారు; ఆ కాలంలో స్థిర మారక వ్యవస్థ, విదేశీ వాణిజ్య-నిధుల కొరత, యుద్ధానంతర పునర్నిర్మాణం ప్రభావంలో మారకం విలువ బలంగా కనిపించింది. రూపాయి విలువ స్వాతంత్ర్యం తర్వాత నుంచి నిరంతరం పడిపోతూ వస్తోంది. 1947లో 1 డాలర్ ₹3.30గా ఉన్న రూపాయి, 2025లో ₹ 90 దాటింది. అంటే, 78 ఏళ్ల జర్నీలో రూపాయి కి ఎదురైన చేదు అనుభవాలు అన్నీ ఇన్నీ కావన్న మాట. దేశ ఆర్థిక వ్యవస్థలోని మార్పులు, సంక్షోభాలు, సంస్కరణలు, ప్రపంచీకరణ ప్రభావాలతో అలా రూపాయి చిక్కిపోతూ వస్తోంది..

| సం. | మారకం విలువ (₹/$) | ముఖ్య సంఘటనలు |
|---|---|---|
| 1947 | ₹3.30 | స్వాతంత్ర్యం; రూపాయి పౌండ్‌కి అనుసంధానం |
| 1966 | ₹7.50 | ఇందిరాగాంధీ ప్రభుత్వం కాలంలో పెద్ద డీవాల్యుయేషన్ |
| 1985 | ₹12.00 | చెల్లింపుల లోటు, ఆర్థిక ఒత్తిడి |
| 1991 | ₹17.90 | ఆర్థిక సంక్షోభం; IMF సహాయం; లిబరలైజేషన్ ప్రారంభం |
| 2000 | ₹44.94 | IT బూమ్; పెట్టుబడులు పెరగడం |
| 2008 | ₹48.88 | గ్లోబల్ ఫైనాన్షియల్ క్రైసిస్ ప్రభావం |
| 2013 | ₹66.00 | పెట్టుబడుల ఉపసంహరణ |
| 2020 | ₹74.00 | COVID-19 మహమ్మారి ప్రభావం |
| 2025 | ₹90.14 | చరిత్రలో కనిష్ట స్థాయి; డాలర్ బలపడటం, దిగుమతులు అధికం |

రూపాయి పతనానికి కారణాలను గనుక విశ్లేషిస్తే, పెట్రోల్, బంగారం, ఎలక్ట్రానిక్స్ వంటి వస్తువులపై అధిక ఆధారపడటం, ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటం, భారతదేశంలో ద్రవ్యోల్బణం అమెరికా కంటే ఎక్కువ ఉండటం, సంక్షోభ సమయంలో విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లడం, అమెరికా వడ్డీ రేట్లు పెరగడం, డాలర్ బలపడటం రూపాయి పతనానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి ... 1966, 1991లో డివాల్యుయేషన్, 2008, 2013, 2020లో గ్లోబల్ సంక్షోభాలు కూడా రూపాయి ఆరోగ్యాన్ని బాగా దెబ్బ తీశాయి. రూపాయి పతనం తర్వాత వివిధ రంగాల మీద ప్రభావం ఎలా ఉండబోతోందో ఒక సారి చూద్దాం ... దిగుమతి ఖర్చులు పెరగడంతో పాటు, పెట్రోల్, ఎలక్ట్రానిక్స్, బంగారం ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది కాబట్టి, సాధారణ కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. ఐటి, టెక్స్‌టైల్, ఫార్మా రంగాలకు రూపాయి పతనం కొంత ప్రయోజనం చేకురుస్తుందనేది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ విద్య, ప్రయాణం, గాడ్జెట్లు ఇవన్నీ భారం కాబోతున్నాయి. మొత్తానికి డాలర్ తో రూపాయి పడిపోవడం దేశ ఆర్థిక స్థిరత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. రూపాయి పతనం ప్రజల ఖర్చులను పెంచుతూ, ఎగుమతిదారులకు లాభం చేకూరుస్తున్నా, దిగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద సవాలుగా మారింది.

# బీజాపూర్ లో భారీ ఎన్ కౌంటర్ 12 మంది మృతి

మొదటిపేజీ తరువాయి....

మావోయిస్టులు ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్, 9 ఎం.ఎం. కార్బైన్, .303 రైఫిల్, గ్రెనేడ్‌లు, రేడియో సెట్‌లు ఉపయోగించారు. ఈ ఎదురుకాల్పుల్లో భద్రతా సైనికులకు ఎలాంటి నష్టం జరగలేదని ఆయన తెలిపారు. బస్తర్ ఐజీ పి. సుందర్‌రాజ్ వివరాలు వెల్లడిస్తూ , ఈ ఎన్‌కౌంటర్‌ను మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించడంలో కీలక విజయంగా పేర్కొన్నారు. 2025లో ఇప్పటివరకు బీజాపూర్‌లో 144 మావోయిస్టులు చంపబడ్డారు. దీనిలో భాగంగా 499 మందిని అరెస్ట్ కావడంతో పాటు , మరో 560 మంది లొంగిపోయారు. ఈ సంవత్సరం జనవరి నుంచి మొత్తం 202 మంది మావోయిస్టుల వరకు మృతి చెందారు. మావోయిస్టులు నాయకత్వం లేక, దిశ తెలియక కేవలం అబుజ్‌మార్ అటవీ ప్రాంతానికే పరిమితమయ్యారు. మిగిలిన తీవ్రవాదులు తప్పించుకోకుండా అధికారులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్డ్ ఫోర్స్ కార్డన్ ఏర్పాటు చేశాయి. ఈ ఆపరేషన్‌లు రెడ్ టెర్రర్‌ను అంతం చేయడంలో విజయవంతమవుతున్నాయని పోలీసులు వెల్లడించారు.

# ప్రయాణికుల అగచాట్లు




మొదటిపేజీ తరువాయి....

బుధవారం 22 అరైవల్స్, 20 డిపార్చర్స్ తో సహా మొత్తం 42 దేశీయ విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, గోవా, కోల్‌కతా, లక్నో వంటి ప్రధాన నగరాలకు వెళ్లే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. మంగళవారం కూడా బెంగళూరులో 20 ఇండిగో విమానాలు రద్దైనట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో విశాఖపట్నం, గోవా, అహ్మదాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, మధురై, హుబ్లీ, భోపాల్, భువనేశ్వర్ నుండి వచ్చే విమానాలతో పాటు, అలాగే ఈ నగరాలకు బయలుదేరే అనేక సర్వీసులు రద్దయ్యాయి. ఇప్పటికే గత వారం రోజులుగా ఇండిగో విమానాలు ఒకటి నుండి మూడు గంటల వరకు ఆలస్యంగా నడుస్తున్నాయని ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇండిగో విమానాల్లో కొనసాగుతున్న సాంకేతిక సమస్యలు, సిబ్బంది డ్యూటీ అవర్స్‌పై ఉన్న FDTL పరిమితులు, అలాగే విమానాశ్రయ రద్దీ కారణంగా పరిస్థితి మరింత దిగజారుతున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

# డిజిటల్ యుగంలో ధర్మ ధ్వజం: సోషల్ మీడియాలో సంఘ్ శంఖారావం



మొదటి పేజీ తరువాయి...

ఒకప్పుడు ఉత్తరాల ద్వారా, పోస్టుకార్డుల ద్వారా సమాచారాన్ని పంపుకున్న సంస్థ, నేడు 'జాయిన్ ఆర్ఎస్ఎస్' (Join RSS) వెబ్ పోర్టల్ ద్వారా ఏటా లక్షలాది మంది యువకులను ఆకర్షిస్తోంది. కరోనా సమయంలో శాఖలు ఆగిపోయినప్పుడు, 'ఈశాఖ'ల (EShakhas) ద్వారా కార్యకలాపాలను నిరంతరాయంగా నడిపిన సాంకేతిక దక్షత సంఘ్‌ది.

ఇందులో, సంఘ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని (IT) ఎలా ఒక సాధనంగా (Tool) మలచుకుంది? సోషల్ మీడియాలో అది సృష్టించిన ప్రభావం ఏమిటి? ఐటీ మిలన్‌ల ద్వారా మేధావి వర్గాన్ని ఎలా ఆకర్షించింది? సైబర్ యోధులుగా మారిన స్వయంసేవకులు దేశానికి ఎలా రక్షణగా నిలుస్తున్నారు? అనే అంశాలను సమగ్రంగా, సానుకూల దృక్పథంతో విశ్లేషించుకుందాం.

**దార్శనికత** – సాంకేతికత ఒక సాధనం, ధర్మమే లక్ష్యం
సంఘ్ ఎప్పుడూ సాంకేతికతను వ్యతిరేకించలేదు. దానిని ఒక అవకాశంగా చూసింది. సంఘ్ ఐదవ సర్ సంఘ్‌చాలక్ శ్రీ కె.ఎస్. సుదర్శన్ గారు స్వయంగా టెలికమ్యూనికేషన్స్ ఇంజనీర్. ఆయన హయాంలోనే (20002009), సంఘ్ సాంకేతికత వైపు వేగంగా అడుగులు వేసింది. ప్రస్తుత సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ గారు, దీనిని మరింత విస్తృతం చేశారు.

**'సాధన'గా టెక్నాలజీ:**
సంఘ్ సిద్ధాంతం ప్రకారం, టెక్నాలజీ అనేది ఒక విలువ లేని (Neutral) వస్తువు. అది మంచి వారి చేతిలో ఉంటే అమృతం, చెడ్డ వారి చేతిలో ఉంటే విషం.

- **"మనం** సాంకేతికతకు బానిసలం కాకూడదు, సాంకేతికతను మన జాతీయ లక్ష్యాలకు వాడుకోవాలి" అనేది సంఘ్ సూత్రం.
- **ఒకప్పుడు** ఋషులు తాళపత్ర గ్రంథాల ద్వారా జ్ఞానాన్ని పంచారు. తర్వాత పుస్తకాల ద్వారా పంచారు. నేడు ఇంటర్నెట్ ద్వారా పంచుతున్నారు. మాధ్యమం మారింది, కానీ సందేశం (సనాతన ధర్మం, దేశభక్తి) అదే.

**మారుతున్న సమాజం – మారుతున్న పద్ధతి:**
సమాజం ఎక్కడుంటే, సంఘ్ అక్కడ ఉండాలి. ఇది డాక్టర్ హెడ్గేవార్ నేర్పిన పాఠం.

- **21వ** శతాబ్దంలో యువత మైదానాల కంటే ఎక్కువగా సోషల్ మీడియాలో (Virtual World) గడుపుతున్నారు. వారిని చేరుకోవాలంటే, వారికి అర్థమయ్యే భాషలో, వారికి అందుబాటులో ఉన్న మాధ్యమంలోనే సంభాషించాలి.
- **అందుకే,** సంఘ్ తన కార్యక్షేత్రాన్ని భౌతిక ప్రపంచం (Physical World) నుంచి డిజిటల్ ప్రపంచానికి (Digital World) విస్తరించింది.

**ఐటీ మిలన్ (IT Milans)** – మేధో మథనానికి డిజిటల్ వేదిక
1990ల చివరలో, భారతదేశంలో ఐటీ విప్లవం (IT Revolution) ప్రారంభమైంది. బెంగళూరు, హైదరాబాద్, పూణే, గుర్గావ్ వంటి నగరాలు ఐటీ హబ్‌లుగా మారాయి. లక్షలాది మంది యువ ఇంజనీర్లు ఈ రంగంలోకి వచ్చారు. వీరి జీవనశైలి, పని గంటలు (Shift timings) సంప్రదాయ శాఖలకు (ఉదయం/సాయంత్రం) అనుకూలంగా లేవు.
ఈ సవాలును సంఘ్ ఒక అవకాశంగా మలచుకుంది. వీరి కోసం ప్రత్యేకంగా రూపొందించిన అద్భుతమైన వేదికే "ఐటీ మిలన్" (IT Milan).

**ఐటీ శాఖల ప్రత్యేకత:**

- **వారాంతపు సమావేశాలు:** ప్రతిరోజూ కాకుండా, వారాంతాల్లో (శనివారం లేదా ఆదివారం) ఒక నిర్ణీత సమయంలో కలుసుకుంటారు.
- **బౌద్ధిక చర్చలు:** ఇక్కడ శారీరక వ్యాయామాల కంటే, బౌద్ధిక చర్చలకు (Intellectual Discussions) ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, గ్రూప్ డిస్కషన్లు, టెక్నాలజీని దేశ సేవకు ఎలా వాడాలనే అంశాలపై మేధోమథనం జరుగుతుంది.
- **ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్:** ఇది కేవలం శాఖ కాదు, ఒక ప్రొఫెషనల్ నెట్‌వర్క్. ఒకే భావజాలం ఉన్న వృత్తి నిపుణులు కలవడం వల్ల, వారి మధ్య సామాజిక, వృత్తిపరమైన బంధాలు బలపడతాయి.

**విస్తరణ:**
బెంగళూరులో ప్రారంభమైన ఈ ప్రయోగం, నేడు సిలికాన్ వాలీ (USA) వరకు విస్తరించింది. వేలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, టెక్ నిపుణులు గర్వంగా "నేను స్వయంసేవక్" అని చెప్పుకుంటున్నారు. వీరే నేడు సోషల్ మీడియాలో సంఘ్ వాయిస్‌ని బలంగా వినిపిస్తున్న "ఇంటెలెక్చువల్ వారియర్స్".

**సోషల్ మీడియా – నరేటివ్ వార్‌ఫేర్ (Narrative Warfare) విజయం**
ఒకప్పుడు మీడియా (పత్రికలు, టీవీ ఛానెళ్లు) పూర్తిగా వామపక్ష, 'కపట లౌకిక' (PseudoSecular) భావజాలం చేతిలో ఉండేవి. సంఘ్ గురించి సానుకూల వార్తలు రాయడం అరుదు. వ్యతిరేక వార్తలు, అసత్య ప్రచారాలు కోకొల్లలు. సంఘ్ తన వాదనను వినిపించడానికి వేదిక ఉండేది కాదు.
కానీ, సోషల్ మీడియా ఆగమనం (Facebook, Twitter, WhatsApp) ఈ ఏకపక్ష ఆధిపత్యాన్ని (Monopoly) బద్దలు కొట్టింది. ఇది సంఘ్‌కు లభించిన "బ్రహ్మాస్త్రం".

**1. సత్యం చెప్పే వేదిక:**

- **ప్రధాన** మీడియా చూపించని నిజాలను, హిందూ సమాజంపై జరుగుతున్న అన్యాయాలను (ఉదాహరణకు: లవ్ జిహాద్, పశ్చిమ బెంగాల్, కేరళలో హిందువులపై దాడులు) ప్రపంచం దృష్టికి తీసుకురావడంలో సోషల్ మీడియా స్వయంసేవకులకు ఆయుధంగా మారింది.
- **సంఘ్ సేవా** కార్యక్రమాలను (కేరళ వరదలు, కరోనా సేవ) ఫోటోలు, వీడియోల ద్వారా ప్రజలకు నేరుగా చూపించగలిగారు. "సంఘ్ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు గూగుల్ సెర్చ్‌లోనే సమాధానం దొరికేలా కంటెంట్‌ను నింపారు.

**2. నరేటివ్ బిల్డింగ్ (Narrative Building):**
గతంలో "హిందుత్వం అంటే మతతత్వం" అనే నరేటివ్ ఉండేది. సోషల్ మీడియా ద్వారా స్వయంసేవకులు "హిందుత్వం అంటే జాతీయవాదం, సమ్మిళిత తత్వం" అనే కొత్త, సానుకూల నరేటివ్‌ను నిర్మించారు.

- **#RSSForNation,** #SevaHiSanghatan, #ProudHindu వంటి హ్యాష్‌ట్యాగ్‌లను ట్రెండ్ చేస్తూ, జాతీయ స్థాయి చర్చను ప్రభావితం చేశారు.
- **యువతలో దేశభక్తిని,** సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంచే కంటెంట్‌ను (రీల్స్, షార్ట్స్, వీడియోలు) వైరల్ చేశారు.

**3. ఫ్యాక్ట్ చెకింగ్ (Fact Checking):**
సంఘ్‌పై వచ్చే తప్పుడు ఆరోపణలను (Fake News) తిప్పికొట్టడానికి, స్వయంసేవకులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. పాత వీడియోలను మార్ఫింగ్ చేసి సంఘ్‌ను అప్రతిష్టపాలు చేయాలని చూస్తే, నిమిషాల్లో అసలు వీడియోను బయటపెట్టి, కుట్రలను భగ్నం చేస్తున్నారు.

**'విశ్వ సంవాద కేంద్రం' (VSK)** – డిజిటల్ వార్తాహరుడు
సోషల్ మీడియా కార్యకలాపాలను, మీడియా సంబంధాలను వ్యవస్థీకృతం చేయడానికి సంఘ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగమే "విశ్వ సంవాద కేంద్రం" (Vishwa Samvad Kendra VSK). ఇది సంఘ్ యొక్క డిజిటల్ మరియు మీడియా విభాగం.
పనితీరు:

- **న్యూస్ పోర్టల్స్:** దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో VSK పేరుతో న్యూస్ పోర్టల్స్, వెబ్‌సైట్‌లు నడుస్తున్నాయి. ఇవి జాతీయవాద దృక్కోణంతో వార్తలను అందిస్తాయి.
- **కంటెంట్ క్రియేషన్:** ఇక్కడ పనిచేసే స్వయంసేవకులు ప్రొఫెషనల్ జర్నలిస్టులు, కంటెంట్ రైటర్లు, గ్రాఫిక్ డిజైనర్లు. వీరు ఆకర్షణీయమైన ఇన్ఫోగ్రాఫిక్స్, వీడియోలను తయారుచేసి సోషల్ మీడియాలో విడుదల చేస్తారు.
- **శిక్షణ:** సోషల్ మీడియాను ఎలా వాడాలి? సైబర్ చట్టాలు ఏమిటి? ఫేక్ న్యూస్‌ను ఎలా గుర్తించాలి? అనే అంశాలపై కార్యకర్తలకు నిరంతరం శిక్షణ ఇస్తారు.

VSK అనేది సంఘ్ యొక్క "డిజిటల్ వెన్నెముక". ఇది సమాచార ప్రవాహాన్ని నియంత్రిస్తూ, సరైన సమాచారం సరైన సమయానికి ప్రజలకు చేరేలా చూస్తుంది.

**జాయిన్ ఆర్ఎస్ఎస్ (Join RSS)** – ఆన్‌లైన్ సభ్యత్వం
సంఘ్ ఆధునికతకు అతిపెద్ద నిదర్శనం "జాయిన్ ఆర్ఎస్ఎస్" ఆన్‌లైన్ పోర్టల్. ఒకప్పుడు సంఘంలో చేరాలంటే, తెలిసిన వారి ద్వారా శాఖకు వెళ్లాల్సి ఉండేది. కానీ ఇప్పుడు, ప్రపంచంలో ఎక్కడి నుంచైనా, ఎవరైనా సంఘ్ వెబ్‌సైట్ (rss.org) ద్వారా చేరడానికి అభ్యర్థన (Request) పెట్టవచ్చు.
అద్భుతమైన స్పందన:

- **ఈ పోర్టల్** ప్రారంభించినప్పటి నుంచి, ఏటా లక్షకు పైగా ఆన్‌లైన్ అభ్యర్థనలు వస్తున్నాయి.
- **ముఖ్యంగా** 2035 ఏళ్ల మధ్య వయసున్న యువత, విద్యావంతులు, టెక్నాలజీ రంగంలో ఉన్నవారు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.
- **అభ్యర్థన** వచ్చిన వెంటనే, స్థానిక కార్యకర్తలు వారిని సంప్రదించి, సంఘంలోకి ఆహ్వానిస్తారు. టెక్నాలజీని ఉపయోగించి సభ్యత్వ నమోదు (Enrollment) చేసుకోవడం సంఘ్ విస్తరణకు కొత్త ఊపిరినిచ్చింది.

**సైబర్ వారియర్స్ – డిజిటల్ రక్షక దళం**
భారతదేశంపై కేవలం సరిహద్దుల్లోనే కాదు, సైబర్ ప్రపంచంలో కూడా యుద్ధం జరుగుతోంది. పాకిస్తాన్, చైనా వంటి శత్రు దేశాలు, కొన్ని విచ్ఛిన్నకర శక్తులు (Tukde Tukde Gang), సోషల్ మీడియా ద్వారా భారత వ్యతిరేక ప్రచారాన్ని, ఫేక్ న్యూస్‌ను వ్యాప్తి చేస్తున్నాయి.
వీరిని ఎదుర్కోవడానికి, సంఘ్ స్వయంసేవకులు స్వచ్ఛందంగా "సైబర్ వారియర్స్" (Cyber Warriors) గా మారారు.

- **వీరు ఏ ఐటీ సెల్** (IT Cell) ఉద్యోగులు కారు. వీరు జీతం కోసం పనిచేయరు. వీరు దేశం కోసం పనిచేస్తారు.
- **దేశానికి వ్యతిరేకంగా** ఏదైనా ట్రెండ్ నడుస్తుంటే, దానికి పోటీగా జాతీయవాద ట్రెండ్‌ను సృష్టించి, శత్రువుల ప్రచారాన్ని తిప్పికొడతారు.
- **ఉదాహరణకు,** CAA (పౌరసత్వ సవరణ చట్టం) సమయంలో జరిగిన తప్పుడు ప్రచారాన్ని, ఆర్టికల్ 370 రద్దు సమయంలో పాకిస్తాన్ చేసిన ప్రచారాన్ని ఈ సైబర్ వారియర్స్ సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. "డిజిటల్ సర్జికల్ స్ట్రైక్" చేశారు.

**కోవిడ్-19 మరియు ఈ-శాఖలు (E-Shakhas)**
2020లో కరోనా మహమ్మారి ప్రపంచాన్ని స్తంభింపజేసినప్పుడు, సంఘ్ కార్యకలాపాలు కూడా ఆగిపోతాయని అందరూ అనుకున్నారు. భౌతిక దూరం (Social Distancing) వల్ల శాఖలు నడపడం అసాధ్యమైంది. కానీ, సంఘ్ ఇక్కడే తన 'అడాప్టబిలిటీ'ని చూపించింది.

**మైదానం నుంచి జూమ్ (Zoom) వరకు:**
కేవలం కొన్ని రోజుల్లోనే, లక్షలాది శాఖలు మైదానాల నుంచి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు (Zoom, Google Meet, Webex) మారాయి. దీనిని "ఈశాఖ" లేదా "ఆన్‌లైన్ శాఖ" అన్నారు.

- **ఉదయాన్నే** ఇళ్లలోనే గణవేష్ (యూనిఫాం) ధరించి, కంప్యూటర్ లేదా ఫోన్ ముందు కూర్చుని, ప్రార్థన చేయడం, వ్యాయామం చేయడం, చర్చలు జరపడం ఒక అద్భుతమైన దృశ్యం.
- **కుటుంబ సభ్యులందరూ** (మహిళలు, పిల్లలు) కూడా ఇందులో పాల్గొనడం వల్ల, ఇవి "కుటుంబ శాఖలు"గా మారాయి.

**డిజిటల్ సేవా సమన్వయం:**
సేవా భారతి కార్యకర్తలు, వాట్సాప్ గ్రూపులు, ప్రత్యేక యాప్స్ ద్వారా సహాయక చర్యలను సమన్వయం చేశారు.

- **ప్లాస్మా** డోనర్లను వెతకడం, బెడ్ల లభ్యతను తెలియజేయడం, ఆహారం అవసరమైన వారిని గుర్తించడం - ఇవన్నీ టెక్నాలజీ సహాయంతో వేగంగా, కచ్చితంగా జరిగాయి. టెక్నాలజీని ప్రాణరక్షణకు ఎలా వాడాలో సంఘ్ చూపించింది.
- **డేటా మేనేజ్‌మెంట్** మరియు సంస్థాగత సామర్థ్యం

ఇంత పెద్ద సంస్థను (లక్షలాది శాఖలు, కోట్లాది మంది సభ్యులు) నడపడం, సమాచారాన్ని పంచుకోవడం ఒక పెద్ద సవాలు. సంఘ్ దీని కోసం అత్యాధునిక సాఫ్ట్‌వేర్ టూల్స్, డేటా మేనేజ్‌మెంట్ పద్ధతులను ఉపయోగిస్తుంది.

- **సంపర్క్ వ్యవస్థ:** అంతర్గత సమాచార మార్పిడి కోసం సురక్షితమైన యాప్స్ (Apps), ఈమెయిల్ గ్రూపులను వాడుతుంది.
- **డిజిటలైజేషన్:** సంఘ్ సాహిత్యం, పాత సంచికలు, పుస్తకాలు, పాటలు - అన్నీ డిజిటలైజ్ చేయబడ్డాయి. 'Archana' వంటి యాప్స్ ద్వారా సంఘ్ ప్రార్థనలు, పాటలు అందరికీ అందుబాటులో ఉన్నాయి.

**ఆధునిక ఋషులు – డిజిటల్ యుగంలో ధర్మ రక్షణ**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, సమాచార సాంకేతికతను వినియోగించుకుంటున్న తీరు, ఒక ఆధునిక మేనేజ్‌మెంట్ కేస్ స్టడీ (Case Study). అది సంప్రదాయాన్ని (Values) వదలకుండానే, ఆధునికతను (Tools) స్వీకరించింది.

- **సోషల్ మీడియాలో** సంఘ్ విజయం, కేవలం సాంకేతిక విజయం కాదు. అదొక సాంస్కృతిక విజయం.
- **పాశ్చాత్య సంస్కృతికి,** అశ్లీలతకు, విద్వేషానికి వేదికగా మారుతున్న ఇంటర్నెట్‌ను, సంఘ్ స్వయంసేవకులు 'ధర్మ ప్రచారానికి', 'దేశభక్తికి', 'సేవకు' వేదికగా మార్చారు.
- **దండం** పట్టుకున్న చేతులే, డేటాను కూడా విశ్లేషిస్తున్నాయి. మైదానంలో చెమట చిందించే కార్యకర్తలే, సైబర్ ప్రపంచంలో మేధోమథనం చేస్తున్నారు.

**21వ శతాబ్దపు భారతదేశం 'డిజిటల్ ఇండియా'గా మారుతున్న వేళ, సంఘ్ కూడా 'డిజిటల్ సంఘ్'గా మారింది. కానీ దాని ఆత్మ (Soul) మాత్రం మారలేదు. అది ఎప్పుడూ 'భారతీయమే'. సాంకేతికత మారుతుంది, సాధనాలు మారుతాయి, కానీ 'భారత్ మాతా కీ జై' అనే నినాదం, 'పరమ వైభవశాలి భారత్' అనే లక్ష్యం మాత్రం శాశ్వతం. ఆ లక్ష్యం వైపు, ఆధునిక సాంకేతికతను జోడెద్దులుగా చేసుకుని, సంఘ రథం వేగంగా దూసుకుపోతోంది.**

రచన: భూక్యా గోపినాయక్

# మోదీ పై ఏఐ వీడియో

మొదటిపేజీ తరువాయి....

దేశ ప్రధానిని కాంగ్రెస్ పార్టీ 150 సార్లకంటే ఎక్కువ అవమానించినదని, ఆయన తల్లిని కూడా లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసారని బీజేపీ నేతలు అన్నారు. ప్రధాని మోదీ 'చాయ్ వాలా' ప్రచారం నేపథ్యంలో గతంలో కూడా కాంగ్రెస్ నాయకులు వివాదాస్పద ప్రకటనలు జారీ చేశారు. 2014లో మణిశంకర్ అయ్యర్ మోదీ ఎప్పటికీ ప్రధానమంత్రిగా కాలేరని, ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన కాంగ్రెస్ సమావేశంలో టీ అమ్మవచ్చని వ్యాఖ్యలు చేశారు. 2017లో యూత్ కాంగ్రెస్ మేమ్ ద్వారా మోడీని ఎగతాళి చేయడం వివాదాస్పదమైంది. ప్రధాని మోడీ అంతర్జాతీయ కార్యక్రమాల్లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఇలాంటి సమావేశాల్లో తీసుకున్న ఫోటోలను తీసుకొని ఏఐ వీడియో తయారు చేయడం రాజకీయంగా వివాదాస్పదమని అనిపిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఈ అంశంపై అధికారికంగా స్పందించలేదు.

# సర్పంచ్ పదవి కోసం అమెరికాకు గుడ్ బై...

మొదటిపేజీ తరువాయి....

రాజకీయాల్లో అడుగుపెట్టిన వెంటనే సర్పంచ్‌గా పోటీ చేయాలన్న అభిలాష కలిగిన ఆమెకి, గతంలో మహిళా రిజర్వేషన్ లేకపోవడంతో అవకాశాలు దక్కలేదు. అయితే ఈసారి మహిళలకు రిజర్వేషన్ రావడంతో నందిని రెడ్డి తన కలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేసింది. గ్రామ ప్రజల ఆశీస్సులు, వారి మద్దతుతో అభివృద్ధి పథకాలను అమలు చేయాలన్న నందిని ఆశయం ఇప్పుడు గ్రామస్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. స్వదేశంలో ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పం ఆమె నామినేషన్‌తో స్పష్టమవుతోంది.

# ఆహ్వానిస్తేనే వెళతా.. పిలిస్తేనే కలుస్తా..!



బెంగళూరు (ఏడీఎన్ఎన్) :

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు కొనసాగుతున్న వేళ ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి న్యూఢిల్లీకి పయనమయ్యారు. ఈ వ్యవహారంపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ, అధికారిక ఆహ్వానం లేనిదే తాను దేశ రాజధానికి వెళ్లనని ఆయన చెప్పారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా డీకే ఓ వివాహానికి హాజరు కావడంతోపాటు పార్టీ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇద్దరు నేతలు ఇటీవల తమ నివాసాల్లో పరస్పర అల్పాహార భేటీలు నిర్వహించిన సంగతి విదితమే. ఒకవైపు డీకే ఢిల్లీకి బయలుదేరుగా, మరోవైపు సీఎం సిద్ధరామయ్య ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళూరుకు చేరుకున్నారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ కూడా హాజరయ్యారు. తర్వాత ముఖ్యమంత్రితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా తాము రాజకీయాలపై చర్చించలేదని సిద్ధరామయ్య మీడియాకు స్పష్టం చేశారు. డీకే ఢిల్లీ టూర్‌పై ప్రశ్నించగా.. "ఆయన్ను వెళ్లనివ్వండి. ఎవరైనా అడ్డు చెప్పారా?" అని బదులిచ్చారు. మీరూ వెళ్తారా? అని అడిగినప్పుడు.. "నన్ను పిలిచినప్పుడే వెళ్తాను. ఇప్పుడు ఆహ్వానించలేదు. కాబట్టి వెళ్లడం లేదు" అని సిద్ధరామయ్య చెప్పారు. ఢిల్లీలో జరిగే సమావేశానికి సంబంధించి పార్టీ హైకమాండ్ నుంచి ఏమైనా ఆదేశాలు ఉంటే , కేసీ వేణుగోపాల్ ద్వారా తెలియజేసేవారని సిద్ధరామయ్య తేల్చి చెప్పారు. ఓ వివాహానికి హాజరయ్యేందుకు ఢిల్లీ వెళ్తున్నట్లు, ప్రయాణానికి ముందు డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 14న ఢిల్లీలో 'ఓటు చోరీ'పై నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో చర్చలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీపై స్పందిస్తూ.. "వేణుగోపాల్, రాహుల్, ఖర్గేలను ఆయన కలవడంలో తప్పేంటి?" అని డీకే ప్రశ్నించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మంగళూరు విమానాశ్రయంలో దిగినప్పుడు.. కొంతమంది 'డీకే.. డీకే..' అంటూ నినాదాలు చేశారు. అలా నినాదాలు చేస్తే తప్పేంటని డిప్యూటీ సీఎం అన్నారు. "గత పదేళ్లుగా ప్రజలు ఈ నినాదాలు చేస్తున్నారు. ఇందులో కొత్తగా ఏమీ లేదు. కొంతమంది 'మోదీ.. మోదీ', మరికొంతమంది 'రాహుల్.. రాహుల్' 'సిద్ధూ.. సిద్ధూ" అని అంటుంటారు. అందులో తప్పేమీ లేదు. ప్రేమ, ఆప్యాయతలతో వారు నినాదాలు చేస్తారు. వాటిని సరదాగా తీసుకోవాలి" అని డీకే చెప్పారు.



# ఎక్సైజ్ శాఖలో లోపాలను సరిదిద్దాలి

## వైసీపీ ఎంపీ గురుమూర్తి లోక్‌సభలో సూచన

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పొగాకు ఉత్పత్తులపై పన్నులు విధించడాన్ని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సమర్థించారు. డిసెంబర్ 3న జరిగిన లోక్‌సభ చర్చలో, సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు 2025ను సమర్థించారు . అయితే, చట్టం అమలులో ఉన్న సాంకేతిక లోపాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యంగా, సిగరెట్ల పొడవులో తప్పుడు డిక్లరేషన్ ద్వారా పన్ను ఎగవేతను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటని గురుమూర్తి ప్రశ్నించారు. అలాగే, యంత్రాలతో తయారైన బీడీలను చేతితో చేసినవిగా చూపించి పన్ను రాయితీలు పొందే మోసగాళ్లను ఎలా గుర్తిస్తారని, నిరోధిస్తారని ఆయన అడిగారు. తక్కువ పన్ను ఉన్న పొగాకును ఎక్కువ పన్ను ఉన్న 'చూయింగ్ టొబాకో' గా మార్చి సరిహద్దుల్లో జరుగుతున్న అక్రమ రవాణాను ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. మార్కెట్‌లోకి వస్తున్న కొత్త ఓరల్ , ట్రాన్స్‌డెర్మల్ నికోటిన్ ఉత్పత్తుల పన్ను రేట్లను ఎప్పుడు ఖరారు చేస్తారని కూడా ఆయన కేంద్రాన్ని అడిగారు. ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడుతూ, ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ఈ బిల్లు దోహదపడుతుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, తుఫాను వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి వెంటనే అండగా నిలవాలని, నష్టపరిహారం ,పంటల బీమాను అందించాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



## పాక్ కక్కుర్తి పై నెటిజన్ల సెటైర్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

శ్రీలంకలో దిత్వా తుపాన్ విధ్వంసంతో సాయం కోసం ఎదురుచూస్తోన్నప్రజలకు పాకిస్తాన్ పంపిన ఆహార ప్యాకెట్లు 'పాస్ట్' అయ్యాయని తేలడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. తుపాన్ తో ఈ సంక్షోభంలో సానుభూతి చూపించామని , ఆహారపు ప్యాకెట్లు సరఫరా చేసినట్లు పాకిస్తాన్ హైకమిషన్ కొలంబోలో పోస్ట్ చేసిన ఫుడ్ ప్యాకెట్ల ఫోటోలు వైరల్ గా మారాయి.

ప్యాకెట్లపై '10/2024' అనే గడువుతీరిపోయిన డేట్ తో కనిపించడంతో నెటిజన్లు సెటైర్లుతో ఓ ఆట ఆడుకుంటున్నారు. లంకేయులకు పంపిన మానవతా సహాయంలో పాకిస్తాన్ పంపినటువంటి ప్యాకెట్లపై లో బియ్యం వంటి ఆహార పదార్థాలు ఉన్నాయి. ఫోటోల్లో కనిపించిన ప్యాకెట్లపై 'ఎక్స్‌పైరీ డేట్: 10/2024' అని స్పష్టంగా కన్పిస్తోంది. ఇప్పుడు 2025 డిసెంబర్‌లో ఇవి పూర్తిగా పాస్ట్ అయ్యాయి. నెటిజన్లు దీన్ని చూసి షాక్ తిన్నారు. గార్బేజ్ లో పారవేయడం కంటే,శ్రీలంక వరద బాధితులకు పంపడం మేలు అనుకుందో.. ఏమో శ్రీలంకకు పంపడాన్ని ఎంచుకుందని తీవ్ర విమర్శలు ప్రారంభించారు. శ్రీలంకలో వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగిపడటం వంటి ఘటనల వల్ల దాదాపు 410 మంది మరణించారు. పాకిస్తాన్ నేవీ క్లారిఫికేషన్ ఇచ్చింది. అత్యవసరంగా బ్యాగులు కావాలని, షిప్‌పై బ్యాక్‌లాగ్‌లో ఉన్న పాత బ్యాగులను ఉపయోగించారని కవర్ చేసుకుంది. మేము శ్రీలంక పౌరులకు సహాయం చేయడానికి కమిటెడ్‌గా ఉన్నామని బ్యాగులు పాతవి కానీ, లోపలి ఆహారపదార్థాలు ఫ్రెష్ అని వాదించారు. అంతేకాకుండా, మంగళవారం డిసెంబర్ 2న పాకిస్తాన్ హైకామిషన్ కొత్త పోస్ట్ చేసింది. పాకిస్తాన్ వరద బాధితులకు రేషన్ బ్యాగులను కొలంబోలోని గంగారామ టెంపుల్ ద్వారా డొనేట్ చేసిందని హైకామిషనర్ మేజర్ జనరల్ ఫహీమ్ ఉల్ అజీజ్ టెంపుల్‌ను సందర్శించి, సహాయం పంపారని చెప్పుకొచ్చారు.



## కాపురాలు కూల్చుతున్న డీఎన్ఏ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆఫ్రికా దేశం ఉగాండాలో ప్రస్తుతం డీఎన్ఏ పరీక్షలంటే వణికిపోతున్నారు. తాజాగా ఇప్పుడు కొందరికి ప్రధాన మ ఆదాయ వనరుగా మారింది. ఉగాండ లో ఇప్పుడు ఏటుచూసినా డీఎన్ఏ టెస్టులు, పత్రికలు, రేడియాలు, సోషల్ మీడియాలో పరీక్షలన్నింటికి సరసమైన ధరలకు చేయబడునని విపరీతమైన ప్రచారం జరుగుతోంది.

దీనికి కారణం అక్కడి మగవాళ్లంతా తమకు పుట్టిన పిల్లలు నిజంగా తమకే పుట్టారా అన్న డౌట్ తో నిర్ధారించుకునేందుకు లక్షలు ఖర్చు పెట్టుకునేందుకు వెనక్కి తగ్గక ముందుకురావడమే కారణం. పిల్లలకు తండ్రి తామే అని నిర్ధారించుకోవాలన్న తపన ఏటు దారితీస్తుందోనని అభిప్రాయాన్ని నిపుణులు పేర్కొంటున్నారు. ఉగాండాలో చాలా మంది భర్తలు నా పిల్లలు నిజంగా నా వారేనా అన్న అనుమానంతో తల్లడిల్లుతున్నారు. దీనికోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహించుకుంటున్నారు. వాస్తవానికి ఓ వివాహబంధంలో పుట్టిన పిల్లలను అనుమానిస్తే ఉగాండా గ్రామీణ ప్రాంతాల్లో అలాంటి వారికి జరిమానా విధించేవారు. కానీ ఇప్పుడు మారుతున్న కాలంతో కాస్త ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాల్లో మగవాళ్లు తమ పిల్లలకు తామే తండ్రి అని నిర్ధారించుకోవాలని భీష్మ ప్రతిజ్ఞ చేశారు. అక్కడ ఇక డీఎన్ఏ టెస్టులు అందుబాటులోకి రావడంతో ఈ పద్ధతి ఈజీగా మారిపోయింది. టెస్టులు చేయించుకుంటే 98 శాతం పిల్లలకు తండ్రులు వేర్వేరు గా ఉన్నారు. ఉగాండాలో ఇప్పుడు డీఎన్ఏ పరీక్ష ధర 1.5 లక్షల నుంచి రూ.2 లక్షల రూపాయలు వరకు ఉంటుంది. గ్రామాల్లో చాలా మందికి డబ్బు లేక టెస్టుల వరకూ వెళ్లడం లేదు. కానీ పట్టణాల్లో టెస్టులు చేయిస్తున్న వారిలో 98 శాతం మంది ఫలితం పిల్లల డీఎన్ఏతో తండ్రి డీఎన్ఏ సరిపోలడం లేదని తెలుస్తోంది. డీఎన్ఏ తో తీవ్ర తలనొప్పులు తప్పడం లేదు. భార్యాభర్తల మధ్య గొడవలు, కొట్లాటలు, విడాకులు పెరిగిపోతున్నాయి. సంతానం పుట్టాక చాలా సంవత్సరాల తర్వాత కూడా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. ఆస్తి పంపకాలు, వారసత్వం విషయాల్లో ఈ డీఎన్ఏ రిపోర్టుల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటున్నారు. కుటుంబాలను నిలబెట్టేందుకు చర్చి పాస్టర్ల ప్రయత్నాలు అయితే, డీఎన్ఏ టెస్టుల వల్ల పెద్ద ఎత్తున వివాహాలు విచ్ఛిన్నమవుతూండటంతో గ్రామ నాయకులు, పెద్దలు నచ్చ చెప్పేందుకు నానా తంటాలు పడుతున్నారు. తమ వద్ద పంచాయతీకి వచ్చే జంటలను సముదాయించడం వారి వల్ల కావడం లేదు. గతంలో ఏలాంటి అనుమానం వచ్చినా మా మధ్యలో మాట్లాడించి సర్దిచెప్పేవాళ్లుం. ఇప్పుడు డీఎన్ఏ , రిపోర్ట్ వచ్చాక ఎవరూ వినడం లేదని వారంటున్నారు. చర్చి పాస్టర్లు, బిషప్‌లు ఇంట్లో పుట్టాడు అంటే మీ పిల్లవాడే, యేసు కూడా జోసెఫ్‌కి సొంతం కాదు కదా , అయినా జోసెఫ్ పెంచాడు" అని బోధిస్తున్నారు. ఉగాండా ప్రభుత్వం గుండె ధైర్యం ఎక్కువగా ఉన్నవారే టెస్టులు చేయించుకోవాలని లేకపోతే వద్దని ప్రచారం చేస్తోంది. డీఎన్ఏ పరీక్షలు చేయిస్తున్న వారిలో 98 శాతం మందికి పిల్లలు తమ పిల్లలు కాదని తెలుస్తూండటమే అసలు కీలకంగా మారింది. మరో ట్విస్ట్ ఏంటంటే , నేరాల పెరుగుదలకు కారణం అవుతున్నాయి. ఆస్తి గొడవలు పేట్రేగిపోతున్నాయి. డీఎన్ఏ టెస్టుల డిమాండ్ పెరుగుతూండటంతో, ఆస్పత్రులు ధరలను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో ఈ టెస్టులు చేయిచుకునేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది అంటున్నారు. ఇదే జరిగితే మొత్తం ఉగాండా కుటుంబ వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

# విమాన రంగాన్ని కుదిపేసిన టెక్ గ్లిచ్

**45 నిమిషాల పాటు ఆగిన చెక్-ఇన్**

**• అమాడియస్ సాఫ్ట్ వేర్ లో సమస్యలు**

**• తరచుగా డిజిటల్ ఇబ్బందులు**



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**


తాజాగా ఎయిర్ బస్ 320 లో తలెత్తిన సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లో కేవలం 45 నిమిషాల పాటు తలెత్తిన సాంకేతిక లోపం (గ్లిచ్) విమానాశ్రయాల్లో గందరగోళానికి దారి తీసింది. చెక్‌ఇన్ ప్రక్రియలు నెమ్మదించడంతో ప్రయాణికులు అవస్థలు ప్రస్తుతం సిస్టమ్ స్థిరంగా ఉందని, విమానాలు షెడ్యూల్ ప్రకారమే నడుస్తున్నాయని ఎయిర్ ఇండియా ధ్రువీకరించింది.

విమానయాన పరిశ్రమలో విస్తృతంగా ఉపయోగించే 'అమాడియస్' అనే సాఫ్ట్ వేర్‌లోనే ఈ సమస్య తలెత్తినట్లు విమానయాన సంస్థలు వివరించాయి . ప్రపంచంలోని అతిపెద్ద ట్రావెల్‌టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లలో అమాడియస్ ఒకటిగా గుర్తింపు ఉంది. టికెట్ బుకింగ్, చెక్‌ఇన్, సీట్ల కేటాయింపు, బోర్డింగ్, డిపార్చర్ కంట్రోల్ వరకు అన్ని కీలక కార్యకలాపాలను నిర్వహించడానికి విమానయాన సంస్థలు దీనిమీదనే ఆధారపడతాయి. ఇది విమానయాన సంస్థలకు ఒక డిజిటల్ వెన్నెముక లాంటిది. అమాడియస్ కేంద్రీకృత బుకింగ్ వ్యవస్థలో వచ్చిన సాంకేతిక లోపంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక విమానయాన సంస్థల సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. చెక్-ఇన్, బ్యాగేజ్ పంపిణీ, బోర్డింగ్ ప్రక్రియలు ఒకదానికొకటి ముడిపడి ఉండటంతో విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజూ లక్షలాది బుకింగ్‌లను నిర్వర్తించే ఈ వ్యవస్థలో చిన్న సమస్య కూడా విస్తృత ప్రభావం చూపుతుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం లోపం సరిదిద్దినప్పటికీ, ఆధునిక విమాన ప్రయాణాలు సాంకేతిక వ్యవస్థలపై ఎంతగా ఆధారపడి ఉన్నాయో ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

# భారతీయుడికి 61 కోట్ల జాక్ పాట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

సౌదీ అరేబియాలో ఉంటున్న భారతీయుడికి భారీ జాక్‌పాట్ తగిలింది. రాజన్ నవంబర్ 9న టికెట్ (282824) కొనుగోలు చేశారు. డిసెంబర్ 3న జరిగిన లక్కీ డ్రా తీయడంతో విజేతగా నిలిచారు. అబుధాబి వేదికగా నిర్వహించే లాటరీ 'బిగ్ టికెట్ డ్రా సిరీస్ 281'లో కేరళకు చెందిన పీవీ రాజన్ రూ.61.37 కోట్లు (25 మిలియన్ల దిర్హామ్‌లు) గెలుచుకున్నారు.



గత 15 ఏళ్లుగా పీవీ రాజన్ 'బిగ్ టికెట్' లాటరీ కొంటున్నప్పటికీ ఈరోజు ఆయనను అదృష్టం వరించింది. లాటరీ నిర్వాహకులు రిచార్డ్, బౌచ్రా సమక్షంలో గత సిరీస్ విజేత అయిన మరో భారతీయుడు శరవణన్ వెంకటాచలం లక్కీ డ్రా ను తీశారు. ఇందులో రాజన్ కొన్న టికెట్‌కు బంపర్ ఆఫర్ తగలడంతో ఆయన ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. లాటరీ తగిలిన విషయాన్ని ఫోన్లో నిర్వాహకులు చెప్పగా, రాజన్ ఉబ్బితబ్బిబ్బయ్యి, చాలా ఆనందంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. తాను లైవ్ షో చూడలేదని, ఆ సమయంలో బయట ఉన్నట్లు తెలిపారు. తాను గెలుచుకున్న డబ్బును తన 15 మంది సహచరులతో పంచుకుంటానని ఆయన స్పష్టం చేశారు. రాజన్ సౌదీ అరేబియాలోని ఓ కంపెనీలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నారు. ప్రముఖ లాటరీ అయిన 'బిగ్ టికెట్ అబుధాబి' ప్రతినెల లక్కీడ్రాను నిర్వహిస్తుంది. ప్రతినెలా గ్రాండ్ ప్రైజ్‌తో పాటు పలు కన్సోలేషన్ బహుమతులను సైతం అందిస్తుంది. ఈసారి 10 మంది కన్సోలేషన్ విజేతలు రూ.2.45 లక్షలు చొప్పున అందుకున్నారు. వీరిలో ముగ్గురు భారతీయులు కూడా ఉన్నారు. గత నెల 3న తీసిన బిగ్ టికెట్ లక్కీడ్రాలో తమిళనాడుకు చెందిన శరవణన్ వెంకటాచలం విజేతగా నిలిచారు. దీంతో ఆయన 25 మిలియన్ల దిర్హాములు అందుకున్నారు. బిగ్ టికెట్ లాటరీని భారతీయులు వరుసగా రెండోసారి కైవసం చేసుకోవడం గెలవడం విశేషం.

# ఇరాన్ కరెన్సీ దారుణ పతనం



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పశ్చిమాసియా దేశం ఇరాన్ కరెన్సీ దారుణంగా పడిపోవడంతో ఆర్థికంగా కుదేలవుతోంది. డాలర్ విలువతో పోలిస్తే ఇరాన్ కరెన్సీ రికార్డు స్థాయిలో 12 లక్షల రియాల్స్ కు పడిపోయింది. అణు ఆంక్షల ఎఫెక్ట్ ఆ దేశంపై తీవ్రంగా ప్రభావం చూపింది. దేశంలో ఆర్థిక వ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తూ పతనం వైపు దారితీస్తున్నాయి . రియాల్ కరెన్సీ దారుణంగా పడిపోవడంతో ప్రజల జీవన ప్రమాణాలు రోజు రోజుకు దిగజారుతున్నాయి .

మాంసం, బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలు ఆకాశ్నంటుతున్నాయి . ఒకవైపు ధరల మోతతో ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల గురించి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరాన్‌పై ఆంక్షలతో విరుచుపడ్డారు. ఇరాన్‌తో ముడిచమురు వ్యాపారం చేస్తోన్న సంస్థలపై ఆంక్షలు భారం మోపారు. చైనాకు డిస్కౌంట్‌కు విక్రయిస్తోన్న చమురు సంస్థలు సైతం ఉన్నాయి. ఈ సెప్టెంబర్ మాసంలో ఐరాస ఇరాన్‌పై అణు ఆంక్షలను పునరుద్ధరించింది. దీంతో విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు స్తంభించిపోవడంతో , ఆయుధ ఒప్పందాలు నిలిచిపోనున్నాయి . ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్‌లో ఏదైనా పురోగతి ఉంటే కఠిన చర్యలు ఎదర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇదిలాఉండగా, ఇరాన్ దేశంలో పలు సవాళ్లను ఎదుర్కొంటుంది. అవినీతి, అసమర్థ నిర్వహణ వంటివి ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి . పవర్ గ్రిడ్‌ల వైఫల్యంతో దేశంలో గంటలపాటు బ్లాక్ అవుట్ లను చవిచూస్తోంది. దేశంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్న క్రమంలో ఇంధన సంక్షోభం వెంటాడుతోంది. భారీ స్థాయిలో సహజవాయువు, ముడి చమురు నిక్షేపాలు ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఇంధన రంగాన్ని సిద్ధం చేయలేకపోతోందనే వాదన సాగుతోంది. కీలక సమయాల్లో ఇంధన కొరత వాటిల్లుతుందని సమాచారం. అణ్వస్త్ర కార్యక్రమాల కారణంగా అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా పతనావస్థలో ఉంది. 2015లో అగ్రరాజ్యంతో ఇరాన్ అణు ఒప్పందం చేసుకునే నాటికి ఒక డాలర్‌కు 32వేల రియాల్స్ ఉండేవి. 2018లో ట్రంప్ ఆ ఒప్పందం నుంచి బయటకువచ్చారు. మళ్లీ ఒప్పందం కోసం చర్చలు మొదలుపెట్టినప్పటికీ.. అవి ప్రస్తుతం నిలిచిపోయాయి. దాంతో కొంతకాలంగా భారీగా పతనమవుతూ వస్తోన్న రియాల్ విలువ.. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల నాటికి 7.03 లక్షలకు ఆ పతనం అంచుకు కొనసాగుతూనే ఉంది.

# ఇంతటి గడ్డు పరిస్థితులను నా జీవితంలో చూడలేదు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**దిత్వా తుపాను ప్రభావం తమ గ్రామంపై ఏ స్థాయిలో విరుచుకు పడిందో ఆమె చెప్పారు. శ్రీలంకలోని కాండీ పర్వత ప్రాంతంలోనున్న వారియగళ గ్రామానికి చెందిన పుష్పకళ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తాయని తాను ఊహించలేదని పుష్పకళ చెప్పారు. తుపాను శ్రీలంకలో తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు, నీలంబే ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదైంది.**



పర్వత వాలులోనున్న వారియగళ ప్రాంతంలో ఏకంగా 43 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక్కడ దాదాపు 200 కుటుంబాలకు చెందిన 700 మందికి పైగా జీవిసిస్తున్నారు. బాహ్య ప్రపంచంతో వారికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. తాము ఒంటరి అయిపోయామని ప్రజలంతా ఆందోళనలో ఉన్నారు. 'కరోనా కాలంలో కూడా మేం ఇలాంటి బాధలు అనుభవించలేదు' అని పుష్పకళ అన్నారు. రోడ్లు మూసుకుపోయాయి... వారియగళ ఒక కొండపైన ఉన్న గ్రామం. ఈ గ్రామానికి వెళ్లడానికి రోడ్లు ఉన్నాయి. అయితే, గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆ రోడ్లు మూసుకుపోయాయి. భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లు శిథిలమైపోయినట్లు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో, వారియగళ ప్రజలు సమీప పట్టణ ప్రాంతాలకు ప్రయాణించలేకపోతున్నారు. అలాగే బయటి ప్రాంతాల నుంచి ఆ గ్రామానికి వెళ్లడం కష్టమైపోయింది. బాహ్య ప్రపంచంతో అన్ని మార్గాలు మూసుకుపోవడంతో, ఈ గ్రామం ప్రజలు తాము పూర్తిగా ఒంటరివారమైపోయామని ఆవేదనలో ఉన్నారు. అనేక క్లిష్ట పరిస్థితుల మధ్య, వారు సోమవారం అడవి మధ్యలో నుంచి కొత్తగా కాలిబాట ఏర్పాటు చేసుకున్నారు. ఈ తాత్కాలిక బాట గుండానే బీబీసీ బృందం ఆ గ్రామం వైపుకు వచ్చింది. నిత్యావసర వస్తువులు కూడా తెచ్చుకోలేకపోతున్నాం... వర్షాల ధాటికి ఈ ప్రాంతంలో అనేకచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. వీటివల్ల గ్రామంలో కొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే, ప్రాణనష్టమేమీ జరగలేదు. కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. బయటి ప్రాంతాలతో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో, నిత్యావసర వస్తువులు తెచ్చుకోడానికి కూడా వీలుకాని పరిస్థితి, అంటే రోడ్డు మార్గం లేదు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు, ఆహారం కోసం వెతుకులాడే పరిస్థితుల్లోకి వెళ్లిపోయారు. "నా వయసు 40 సంవత్సరాలు. నా జీవితంలో ఇలాంటిది జరుగుతుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. మేము మా పిల్లలను ఎత్తుకుని రాత్రి పూట ఇక్కడా, అక్కడా తిరిగాం. నాకు ఏమి చెప్పాలో తెలియడం లేదు. మాకు తలదాచుకోడానికి సురక్షితమైన చోటు దొరకలేదు" అని పుష్పకళ చెప్పారు. చాలా రోజుల తర్వాత, ఆ ప్రాంతంలోని మగవారు ఆహారం కొనడానికి నగరానికి వెళ్లారని తెలిపారు. "నా భర్త, మరికొంతమంది గ్రామస్థులు సరకులు కొనడానికి ఉదయం వెళ్లి రాత్రికి వచ్చారు. చాలా కష్టపడి సరకులు తెచ్చారు. ఏం జరుగుతోందో పిల్లలకు అర్థం కావడం లేదు. ఈ కొండపైన ఒక పెద్ద రాయి ఉంది. అది ఎక్కడ పడుతుందో, ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి" అని ఆమె ఆందోళన చెందారు. 'ఇలాంటి విపత్తును గతంలో చూడలేదు...' ఇలాంటి సంఘటన మళ్లీ ఎప్పుడూ జరగకూడదని ఇంద్రాణి చెబుతున్నారు. ''ఇంత నష్టం జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. ఈ రోజు వరకు మమ్మల్ని చూడటానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. మాకు ఒక్క పూట కూడా భోజనం అందలేదు. షాపుల్లో బిస్కెట్లు కూడా స్టాకు లేవు" అని ఇంద్రాణి అన్నారు. తన జీవితంలో ఇంత దారుణమైన విపత్తును ఎప్పుడూ చూడలేదని 81 ఏళ్ల గోవిందమ్మ చెప్పారు. "నాకు పెద్ద శబ్దం వినిపించింది. నా కొడుకు నన్ను తీసుకెళ్లడానికి వచ్చాడు. ఇంట్లో ఉన్న నాలుగు మేకలు చనిపోయాయి. ఈ రోజు తినడానికి కూడా ఇంట్లో నిత్యావసరాలు లేని పరిస్థితి ఉంది" అని గోవిందమ్మ అన్నారు. "మా గ్రామానికి రెండు రోడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ రెండు రోడ్లు కూడా నాశనమైపోయాయి. ఒంటరిగా ఉన్నాము. మాకు సహాయం అందడం, అందించేవారు లేరు. మమ్మల్ని చూడటానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. ఈ గ్రామంలో తమిళులు, సింహళీయులు అంతా కలిసి 200 కుటుంబాలు ఉన్నాయి. తినడానికి కూడా ఏమి ఆహారం లేదు. కొందామన్న ఏమీ దొరకని పరిస్థితి, మాకు ప్రభుత్వ సహాయం కావాలి" అని ఆ ప్రాంత వాసి శివ కోరారు.



## భారత్ అంటే మునీర్‌కు కడుపు మంట

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ తో యుద్ధం కోసం తహతహలాడుతున్నారని , ఆతనోక ఇస్లామిక్ ఛాందసవాదంటూ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ పై ఆదేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

తన సోదరుడు మాత్రం దాయాది దేశంతో స్నేహ, దౌత్య సంబంధాల కోసం ప్రయత్నించే వారని ఆమె గుర్తుచేశారు. ఓ మీడియాకు బుధవారం ఇచ్చిన ముఖాముఖీ కార్యక్రమంలో అలీమా ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఇమ్రాన్ స్వేచ్ఛావాది అని, సందర్భం వచ్చినప్పుడల్లా మునీర్ భారత్‌తో ఘర్షణలకు దిగుతాడని అలీమా ఆరోపించారు. . ఇది భారత్‌తో పాటు దాని మిత్ర దేశాలకు కూడా నష్టమే' అని ఆమె పేర్కొన్నారు. మాజీ ప్రధాని జైల్లోనే మృతి చెందారంటూ పెద్దఎత్తున ప్రచారం జరిగిన నేపథ్యంలో ఆయన మరో సోదరి ఉజ్మా ఖానుమ్ ఇమ్రాన్‌ను మంగళవారం కలిసిన సంగతి తెలిసిందే. సమావేశం తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తాను జైలు శిక్ష అనుభవించడానికి ఆసిమ్ మునీర్ కారణమని ఇమ్రాన్ తనతో చెప్పాడని ఉజ్మా తెలిపారు. పాక్ ప్రభుత్వంపై ఆమె పలు విమర్శలు చేశారు. పాక్ ప్రజలను అణచివేసేందుకు వాళ్లు ప్రయత్నిస్తున్నారని ఉజ్మా వ్యాఖ్యానించారు.



## బాలుడితో హంతకుడిని చంపించిన తాలిబన్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆఫ్ఘనిస్తాన్ లో తాలిబన్లు విధించే శిక్షలు ఎంత కఠినంగా ఉంటాయో అందరికీ తెలిసిందే. తాజాగా ఒకే కుటుంబంలో 13 మందిని దారుణంగా చంపిన వ్యక్తికి తాలిబన్లు విధించిన శిక్ష ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ఖోస్ట్ ప్రావిన్స్ లో కొన్ని నెలల క్రితం తొమ్మిది మంది పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 13 మందిని ఓ వ్యక్తి అతికిరాతంగా హత్య చేశాడు.

ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు ,నిందితుడికి మరణ దండన విధించింది. కోర్టు తీర్పుతో తాలిబన్ పాలకులు హంతకుడికి బహిరంగంగా మరణ శిక్ష అమలు చేశారు. దాదాపుగా 80 వేల మంది పైగా చూస్తుండగానే బాధిత కుటుంబంలోని 13 ఏండ్ల బాలుడితో హంతకుడిని అతికిరాతంగా కాల్చి చంపించారు. ఈ దారుణ ఘటన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హంతకుడిని మంగల్‌గా గుర్తించారు. తాలిబన్లు విధించిన చట్టాలను వ్యతిరేకించినా , లేదంటే నేరాలకు పాల్పడిన వారికి బహిరంగంగానే ఉరి తీస్తారు.

## వలసలపై ఆ దేశాలకే ముప్పు



అమెరికా, యూరప్ దేశాల్లో వలసలపై ఆంక్షలతో నష్టపోయేది ఆ దేశాలేనని భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలపై మితిమీరిన ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఆ ఆంక్షలు విధించిన దేశాల సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందని కేంద్ర మంత్రి జై శంకర్ తెలిపారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
04.12.2025
www.manasarkar.com



## రోడ్డు ప్రమాద బాధితులకు వైసీపీ నేత సాయం

**అల్లూరు సీతారామరాజు జిల్లా (ఏడీఎన్ఎన్) :**

రంపచోడవరం డివిజన్ లో కరెంట్ ఆఫీస్ దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రంపచోడవరం నుంచి బందపల్లి వెళుతుండగా ఆర్టీసీ బస్సు ని వెనక నుంచి ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

ఈ ప్రమాదం లో బందపల్లి గ్రామానికి చెందిన సోముల లక్ష్మణరెడ్డి అక్కడి కక్కడే మరణించగా, విండెల రవీంద్ర తీవ్రంగా గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి గురైన వారిని చూసి చలించిపోయిన రంపచోడవరం నియోజ కవర్గ వైసీపీ ఎస్ టీ సెల్ అధ్యక్షులు పండా రామకృష్ణదొర , ప్రభుత్వ అంబు లెన్సు రాక ఆలస్యంతో ప్రాణనికే ముప్పు అని భావించి ప్రయివేట్ ఆటోలో సమీపంలో గల రంపచోడవరం ఏరియా హాస్పిటల్ కి దగ్గర ఉండి తీసుకోని వెళ్లారు. పరిస్థితి గమనించిన వైద్యులు ప్రధమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం రాజమండ్రి ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించినట్లు వైసీపీ నాయకుడు రామకృష్ణదొర తెలియజేశారు.



## డ్రైయిన్లను ఆధునీకరించి రైతులను ఆదుకోండి

**కోనసీమ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో ప్రధానమైన మురుగు కాలువలు చాలావరకు ఆక్రమణలకు గురవుతున్నాయని జిల్లా వైసీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరుకొండ సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు.

ముమ్మిడివరంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా జిల్లాకు చెందిన మురుగు కాలువలు 16 ఉన్నాయని, మధ్యతర గతి మురుగుకాలువలు 37 , చిన్న కాలువలు 238 ఉండగా, ఇవి చాలావ రకు అధికార పార్టీ నేతలు ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. దీంతో కాలువలను ఆధునీకరించక పోవడంతో వర్షాలు, వరదల సమయంలో మురుగు నీరు దిగే అవకాశం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వైసీపీ రైతు విభాగం తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాను మూడు భాగాలుగా విభజించి మురుగు కాలువలను ఆధునీకరిం చామని, ప్రస్తుతం జిల్లా మొత్తం మురుగుకాలువల ఆధునీకరణ ఒక వ్యక్తికే అప్పగించి, మూడు కోట్ల రూపాయలను గంపగుత్తగా అప్పగించారని సత్య నారాయణ తెలిపారు. మురుగు కాలువలలో ఏవిధమైన పనులు చేయకుండా సదరు వ్యక్తి నిధులను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కొరకు అందరూ కలిసిరావాలని, రైతుల సంక్షేమమే రాష్ట్రాని కి ప్రగతి అని నారాయణ అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ వైసీపీ రైతు విభాగం కన్వీనర్ వీరబాబు, వైసీపీ రైతు విభాగం మండల కన్వీనర్ జగతా బాబ్జీ, వైసీపీ రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ కోనా శ్రీను తదితరులు ఈ సమావేశం లో పాల్గొన్నారు.



## పవన్ డిప్యూటీ సీఎం పదవికి అనర్హుడు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై సీపీఐ నాయకుడు కె. నారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి పూర్తిగా అనర్హుడని వ్యాఖ్యానించిన నారాయణ, ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కోనసీమ పర్యటనలో పవన్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని, ప్రజల మధ్య నెలకొన్న సత్సంబంధాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని నారాయణ విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన కుమార్తెకు ఏపీ భీమవరానికి చెందిన యువకునితో పెళ్లి చేయడం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అన్యోన్యతకు ఉదాహరణగా చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నమని ఆరోపించారు. ఇదే సందర్భంగా పవన్ కల్యాణ్ రాజకీయ ధోరణిపై కూడా నారాయణ దుయ్యబట్టారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో చేగువేరా తనకు ఆదర్శమని చెప్పిన పవన్, ఇప్పుడు సావర్కర్‌ను భుజానకెత్తుకుని 'సనాతన ధర్మం' పేరుతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. నిజంగా సనాతనంపై ఆసక్తి ఉంటే రాజకీయాలు వదిలి ఆ మార్గంలో నడవాలని ఆయన సూచించారు. 'దిష్టి తగిలింది' వంటి వ్యాఖ్యలు చేసే సనాతనవాదులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని వ్యాఖ్యానించిన నారాయణ, పవన్ కల్యాణ్‌కు రాజకీయ అర్హతలు లేవని, వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# దివ్యాంగులకు అండగా సర్కార్



**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

దివ్యాంగుల కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్తను వెల్లడించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తరఫున ఏడు కీలక ప్రకటనలు చేశారు.

ఇకపై ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. దివ్యాంగుల ప్రతినిధ్యాన్ని పెంచేందుకు స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్‌లో కనీసం ఒక దివ్యాంగ ప్రతినిధిని నామినేట్ చేస్తామని సీఎం తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయిలో అమరావతిలో 'దివ్యాంగ్ భవన్' నిర్మాణం చేపడతామని ప్రకటించారు. దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఫైనాన్షియల్ సబ్సిడీ పథకాన్ని మళ్లీ ప్రారంభిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. శారీరక అంగవైకల్యం ఉన్న వారికీ క్రీడలు, ప్రతిభ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా అందుబాటులో ఉండేలా శాప్ ద్వారా అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవనాల నిర్మాణంలో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తూ, బహుళ అంతస్తుల ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టుల్లో వారికి గ్రౌండ్ ఫ్లోర్ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కాలేజీ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు.

# మత్స్యకారులకు సమస్య వస్తే నాకు వచ్చినట్లే

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. బుధవారం ఉప్పాడ మత్స్యకారులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'మత్స్యకారులకు సమస్య వస్తే నాకు వచ్చినట్లే. మా ఇంట్లోని వారికి సమస్య వచ్చినట్లే భావిస్తాను. అదే భావనతో సమస్యను పరిష్కరిస్తా. ఈ విషయాన్ని అక్టోబరు 9వ తేదీన ఉప్పాడ సెంటర్ నుంచి చెప్పాను. ఇప్పుడు అదే మాట మీద ఉన్నాను. సమస్య వస్తే రాజకీయాలకు అతీతంగా దాని పరిష్కారానికి ముందుకు వెళ్లేవాడిని. నాకు మీ సహకారం కావాలి. నన్ను శంకించకండి.. నేను మీ వాడిని. మిగతా పార్టీల నాయకుల్లా సమస్య వస్తే బూతులు తిట్టడం, గొడవలు పెట్టడం చేయను. పరిష్కారం వచ్చేలా పని చేస్తాను. దాని కోసమే పరితపిస్తాను' అని పవన్ వ్యాఖ్యనించారు. సముద్రపు కాలుష్యం చాలా రకాలుగా ఉంటుందని, మత్స్యకారులు ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్యనా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే దీని మూలాలను శాస్త్రీయంగా వెతికేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టానని పవన్ కల్యాణ్ అన్నారు. ఇప్పుడు డాక్టర్ జో కిజాకూడన్ బృందం రంగంలోకి దిగి ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్యపై పూర్తిస్థాయి అధ్యయనం చేస్తుందని తెలిపారు. దీని మూలాలు వెతికి, శాశ్వత పరిష్కారం వెతుకుదామన్నారు. మత్స్యకారులకు ఎలాంటి సమస్యా రాకుండా చూసుకునే బాధ్యతను నేను తీసుకుంటాను.. అని హామీ ఇచ్చారు. పరిశోధన బృందానికి మత్స్యకారులు తగిన విధంగా సహకరించాలని, వారు తీర ప్రాంతంలో అంతా తిరిగి, సముద్రంలోకి వెళ్లి మరీ కాలుష్యానికి అసలు కారణాలను తెలుసుకుంటారని సూచించారు. అక్టోబరు 9వ తేదీన ఉప్పాడ వేదికగా 100 రోజులు గడువు ఇవ్వాలని మత్స్యకారులను కోరినట్లు తెలిపారు. అప్పటి నుంచి నాతోపాటు నా కార్యాలయ అధికారులు దీనిపై కూలంకషంగా పని చేస్తున్నారన్నారు. సమస్య పరిష్కార దిశగా, మత్స్యకారులకు కొత్త భరోసా ఇచ్చే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. మత్స్యకారులు మారుతున్న కాలంతో మరింత వేగంగా వారి బతుకులను



బంగారు మయం చేసుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు అవుతున్న పద్ధతులను అవలంబించాలన్నారు. దీనికోసం ఉప్పాడ మత్స్యకారుల నుంచి ప్రత్యేకంగా బృందాలను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపుతున్నామని అన్నారు. అక్కడి విధానాలను అవగతం చేసుకోవాలని, దానికి ప్రభుత్వం కూడా మీకు తగిన విధంగా సహకరిస్తుందని తెలిపారు. ఉప్పాడలోని 7200 మంది మత్స్యకారులు, 25,600 మంది వారి కుటుంబ సభ్యులకు జీవన భృతి రెట్టింపు అవ్వాలన్నదే లక్ష్యమని అన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీలో ఉన్నతాధికారుల బదిలీలు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీలో ఉన్నతాధికారుల బదిలీలు, నియామకాలు చేపట్టాయి. ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్)గా పనిచేస్తున్న జి.వి. రవి వర్మను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్)గా ప్రభుత్వం బదిలీ చేసింది. విజయ



నగరం జోన్ ఈడీ బ్రహ్మానంద రెడ్డిని హెడ్ ఆఫీస్‌కు మార్చి, ఆయనను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్)గా నియమించాలని ఆర్టీసీ ఎండీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు అధికారిక ఉత్తర్వులు వెలువరించారు

# కూటమి ప్రభుత్వంలో అంతా అన్యాయమే

**వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి ఆరోపణలు**

కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. పులివెందులలో జరిగిన పార్టీ అవగాహన సదస్సులో మాట్లాడుతూ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ గూండాలు పోలీసులు అండతో దౌర్జన్యాలు చేశారని ఆయన ఆరోపించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, పార్టీ నేత వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో గ్రామ, వార్డు, మండల స్థాయిలో పార్టీ బలోపేతంపై నేతలు సూచనలు ఇచ్చారు. బాధితులపైనే కేసులు పెడుతున్న పోలీసు వ్యవస్థ దారుణమైందని విమర్శించిన అవినాష్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామని నమ్మకం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, నిరుద్యోగులకు భృతి, మహిళలకు సంవత్సరానికి 18 వేల రూపాయల పథకం వంటి కీలక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని ఆరోపించారు. పులివెందుల మెడికల్ కాలేజీ 50 సీట్లు వెనక్కు పంపడం, అరటి కోల్డ్ స్టోరేజ్‌ను నిర్వీర్యం చేయడం వంటి చర్యలు కూటమి ప్రభుత్వ తీరును ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. ప్రజల్లో ఆదరణ లేక టీడీపీ నాయకులు క్రైం రాజకీయాలను నమ్ముకుంటున్నారని అవినాష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గూండాల దౌర్జన్యాలను ఎదుర్కొని ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.



# ఆంధ్రప్రదేశ్‌కు రూ.125 కోట్లు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

కేంద్ర ప్రభుత్వం నక్షా ప్రాజెక్టు కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.125 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. SASCI, NAKSHA కార్యక్రమాల ద్వారా పట్టణ భూసమీకరణ వ్యవస్థ ఆధునికీకరణలో రాష్ట్రం చూపిన పురోగతిని గుర్తించి ఈ నిధులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేసిందని ఆయన పేర్కొన్నారు.

పదకొండు పట్టణ స్థానిక సంస్థల్లో సాధించిన విశేష ఫలితాలకు గుర్తింపుగా ఈ నిధులు వచ్చాయని తెలిపారు. ప్రధాని మోదీ దూరదృష్టి, సీఎం చంద్రబా



బు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర పాలన మరింత బలపడుతోందని 'ఎక్స్' ద్వారా పెమ్మసాని అభిప్రాయపడ్డారు. నక్షా ప్రాజెక్టు కింద ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీ చేయడమే ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టును రాష్ట్రంలో పదికీలక పురపాలక, నగరపాలక సంస్థల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. 2026 మార్చి నెలాఖరులోగా ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు ప్రాపర్టీ కార్డులు అందజేయనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. రెండో దశలో మరికొన్ని పట్టణాలను ఎంపిక చేసే అవకాశం ఉంది. నగరాలు, పట్టణాల్లో భూములపై కచ్చితమైన రికార్డులు తయారు చేయడం, పాత రికార్డులను నవీకరించడం, వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం లక్ష్యంగా జాతీయ జియోస్పేషియల్ సాంకేతికతతో ఈ ప్రత్యేక భూ సర్వే కార్యక్రమాన్ని కేంద్రం ఈ ఏడాది ప్రారంభించింది. పైలట్ ప్రాజెక్టు కోసం దేశవ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసి రూ.194 కోట్లు కేటాయించగా, ఆంధ్రప్రదేశ్‌లో ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, ఏలూరు, తిరుపతి, మంగళగిరి-తాడేపల్లి, కుప్పం వంటి నగరాలను తొలి విడతలో ఎంపిక చేశారు.

# అధికారం శాశ్వతం కాదు చంద్రబాబు

**పల్నాడు (ఏడీఎన్ఎన్) :**

అధికార కోసం చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడతారని మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘనలు చేస్తూ పోలీసు వ్యవస్థను చంద్రబాబు, లోకేష్‌లు పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

పల్నాడులో జరిగిన జంట హత్యల కేసును టీడీపీ అంతర్గత ఘర్షణ కారణంగా జరిగినదిగా ఎస్పీ స్వయంగా ప్రకటించగా, అయినా పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసులు పెట్టడం చంద్రబాబు ప్రభుత్వ దురాశయాలను చూపుతోందని అన్నారు. అలాగే ప్రకాశం జిల్లాలో టీడీపీ రెండో వర్గం నేతనే అదే పార్టీకి చెందిన వర్గం



హత్య చేసినప్పటికీ, వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించడం దారుణమని సుధాకర్ బాబు విమర్శించారు. ములకలచెరువులో బయటపడిన నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ సోదరులు అక్కడ లేనప్పటికీ, కావాలనే వారిపై కేసులు పెట్టి అరెస్టు చేసిన తీరు పోలీసు వ్యవస్థ ఎలా పనిచేస్తోందనే దానిపై ప్రశ్నలు లేవనెత్తుతుందన్నారు. చంద్రబాబుకు అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని హెచ్చరిస్తూ, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు అయి జైలుకెళ్లినప్పుడు ఆరోగ్య సమస్యలను చూపించి బెయిల్ తెచ్చుకున్నారని, సాక్షులను బెదిరించరాదని కోర్టు చెప్పిన ఆదేశాలను కూడా అతిక్రమించినట్లు ఆరోపించారు. ఇవన్నీ బయటపడకుండా ఉండేందుకు ప్రతిరోజూ వైఎస్సార్‌సీపీ నేతలను అరెస్టు చేస్తూ దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైఎస్సార్, జగన్ హయాంలో ప్రశాంతంగా ఉన్న రాయలసీమ, పల్నాడు ప్రాంతాలు చంద్రబాబు తిరిగి అధికారంలోకి రాగానే మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలకు వేదికయ్యాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెడితే న్యాయపోరాటం తప్పదని హెచ్చరించిన సుధాకర్ బాబు, ఒకవైపు ప్రభుత్వ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ, మరోవైపు తమ వర్గానికి చెందిన సినీ నటుల సినిమాలకు అధిక టికెట్ ధరలను అనుమతించడం ద్వంద్వ వైఖరి అని చురకలు వేశారు.




## ఏపీ టెట్ హాల్ టికెట్లు విడుదల

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ లో ఉపాధ్యాయ అర్హత పరీక్షల కోసం హాల్‌టికెట్లు బుధవారం విడుదలయ్యాయి. డిసెంబర్ 10 నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు అధికారిక వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా అందుబాటులో ఉంచారు.

ప్రతి రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. అక్టోబర్ 24 నుంచి నవంబర్ 23 వరకు దరఖాస్తులు స్వీకరించగా, మొత్తం 2,41,509 మంది అభ్యర్థులు 2,71,692 దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే, అభ్యర్థుల సౌలభ్యం కోసం మాక్ టెస్టులను కూడా అందుబాటులో ఉంచారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలంటే అభ్యర్థులు tet2dsc.apcfss.in వెబ్‌సైట్‌కి వెళ్లి, క్యాండిడేట్ లాగిన్ సెక్షన్‌లో యూజర్ నేమ్, పాస్‌వర్డ్, క్యాప్చా ఎంటర్ చేసి హాల్‌టికెట్‌ను పొందవచ్చు. దాన్ని డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.



## రేపిస్ట్ కు యావజ్జీవ కారాగార శిక్ష

**కడప పోక్సో కోర్టు సంచలన తీర్పు**

**కడప (ఏడీఎన్ఎన్) :**

కడప పోక్సో కోర్టు లైంగికదాడి కేసులో నిందితుడికి యావజీవ జైలు శిక్ష మరియు రూ.10,000 జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. రాయలసీమ ఎక్స్ ప్రెస్ ఏసీ బోగీలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు రాంప్రసాద్ రెడ్డికి యావజీవ జైలు శిక్ష విధించినట్లు పోక్సో కోర్టు మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కోర్టు రైల్వే సిబ్బంది, టీసీ లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్పష్టంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితురాలికి రూ.10,50,000 పరిహారం అందించాలని గుంటకల్ ఆర్ఎం కార్యాలయానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటన 2019 జనవరి 19న తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో రాజంపేటనందలూరు మధ్య చోటుచేసుకుంది. బాలిక వాష్‌రూమ్‌కు వెళ్ళినప్పుడు రాంప్రసాద్ రెడ్డి ఆమెపై లైంగికదాడి చేసినట్టు కేసులో వివరించారు. హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన తరువాత, గుంటకల్ ఆర్ఎం నుండి కడపకు రిఫర్ చేయబడింది. కడప రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు, రైల్వే టీసీల నిర్లక్ష్యం ఈ ఘాతుకర ఘటనకు కారణమని పేర్కొని, నిర్లక్ష్యానికి పాల్పడ్డ టీసీ , పోలీస్ సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.



## వివేకా కేసులో లోతుగా విచారించాల్సిందే

- నిందితులు తప్పించుకునే చాన్స్ ఉందన్న న్యాయవాది
- సప్లిమెంటరీ ఛార్జ్ షీట్ వేసేలా సీబీఐకి విజ్ఞప్తి
- తీర్పును ఈ నెల 10కి వాయిదా వేసిన కోర్టు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో లోతైన విచారణ జరగాలని, లేదంటే అసలు నిందితులు తప్పించుకునే ప్రమాదం ఉందని వైఎస్ సునీత తరఫు న్యాయవాది కోర్టుకు స్పష్టం చేశారు. తన తండ్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతూ వివేకా కుమార్తె డా. వైఎస్ సునీత నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై నాంపల్లి సీబీఐ కోర్టులో బుధవారం విచారణ జరిగింది. అయితే , అసలు నిందితులు తప్పించుకోకుండా ఈ కేసు విచారణ జరపాలని సునీత కోరింది. సప్లిమెంటరీ ఛార్జ్ షీట్ వేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. దర్యాప్తు కొనసాగితే సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. దర్యాప్తు కొనసాగించే అవకాశం లేదని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రెండు వైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నెల 10 న తీర్పును వెలువరించనుందని నాంపల్లి కోర్టు తెలిపింది.

# 61,379 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

**రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 61,379 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఏళ్లకేళ్లుగా నియామకాలకు నోచుకోక తల్లడిల్లిన నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భద్రత కల్పిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కొలువుల పండుగను నిర్వహించి నియామక పత్రాలను అందించారని ప్రభుత్వం తెలిపింది.**

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా భారీ సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం, మరో 8,632 పోస్టుల నియామకాలు తుది దశలో ఉన్నాయని, వీటితో కలిపితే మొత్తం నియామకాల సంఖ్య 70,011కు చేరిందని పేర్కొంది. విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ, యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయడమే కాక, యువత నష్టపోకుండా నియామకాల వయో పరిమితిని సడలించిందని గుర్తు చేసింది. గతంలో గందరగోళమైన గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 16,067, మెడికల్ అండ్ హెల్త్ బోర్డు ద్వారా 8,666, డీఎస్సీ ద్వారా 10,006 పోస్టులతో సహా వివిధ విభాగాల్లో నియామకాలు పూర్తి చేసి నిరుద్యోగుల పట్ల తమ నిబద్ధతను చాటుకుందని ప్రభుత్వం వెల్లడించింది.




# జర్నలిస్టుల మహా ధర్నా గ్రాండ్ సక్సెస్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**పన్నెండేండ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ... మాసాబ్ ట్యాంక్ లోని సమాచార కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(TUWJ)ఆధ్వర్యంలో బుధవారం నాడు జరిగిన మహా ధర్నా అనూహ్యరీతిలో విజయవంతం అయ్యింది.**

టీయూడబ్ల్యూజే పిలుపుపై స్పందించి, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ఏంతో ఉత్సాహంగా, భారీగా జర్నలిస్టులు తరలి రావడం విశేషం. జర్నలిస్టుల నినాదాలతో మహానగరం రోడ్లన్నీ దద్దరిల్లాయి. సమాచార శాఖ చరిత్రలో, ఆ కార్యాలయం వద్ద ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ధర్నా చేయడం ప్రప్రథమని పోలీసు అధికారులతో సహా పలువురు సీనియర్ పాత్రికేయులు చర్చించుకోవడం విశేషం. ఈ మహా ధర్నాకు యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్యలతో పాటు హైదరాబాద్ ప్రెస్ క్లబ్, జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, టీజేఏలు సంపూర్ణ మద్దతును ప్రకటించి మహా ధర్నాలో భాగస్వామ్యమయ్యాయి. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నాలో, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం. ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ,ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, నగునూరి శేఖర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్ రెడ్డి, రమేష్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్. హరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు వి. యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి,మధు గౌడ్, ఫైసల్, హెచ్. యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, ఈ మహా ధర్నాలో వయోదిక జర్నలిస్టుల సంక్షేమ సంఘం కూడా భాగస్వామ్యం అయ్యింది. ఆ సంఘం నాయకుడు శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఉర్దూ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు మాట్లాడారు.

# త్వరలోనే 40 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

**సీఎం రేవంత్ రెడ్డి హామీ**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**రాష్ట్రంలో మరో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ త్వరలోనే చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గ పర్యటన సందర్భంగా సీఎం బుధవారం ఈ కీలక ప్రకటనలు చేశారు. హుస్నాబాద్‌లో రూ.262 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు . తర్వాత నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ , కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన విషయం గుర్తుచేశారు.**

మొత్తం రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న వాగ్దానాన్ని తప్పకుండా నెరవేర్చుతామని స్పష్టం చేశారు.హుస్నాబాద్ ప్రాంతం చారిత్రాత్మక పోరా



టాలకు నేతృత్వం వహించిన భూభాగమని, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నుంచి తెలంగాణ ఉద్యమం వరకు ఈ నేల పోరాట స్ఫూర్తికి నిలయమని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సోనియా గాంధీ నిర్ణయం కరీంనగర్‌లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకేనని సీఎం గుర్తుచేశారు. శ్రీకాంతాచారి త్యాగం, ప్రజల ఆశయాలు కలిసి తెలంగాణ సాధ్యమయ్యాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని దండగగా భావించే రోజులు పోయాయని, పండుగలా మార్చింది తమ ప్రభుత్వమని సీఎం అన్నారు. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రం తెలంగాణగా నిలుస్తుండటం పట్ల గర్వం వ్యక్తం చేశారు. రైతుల కోసం ఇప్పటి వరకు రూ.లక్ష కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చుచేసిందని వివరించారు. ప్రజా సంక్షేమంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి సభలో ప్రస్తావించారు. ఆడబిడ్డలకు బస్సుల యాజమాన్యాన్ని కల్పించడం, రాష్ట్రవ్యాప్తంగా 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేయడం, పేదల గృహాల నిర్మాణానికి రూ.22,500 కోట్లు కేటాయించడం వంటి కీలక సంక్షేమ కార్యక్రమాలు తమ పాలనలో ప్రజలకు అందుతున్న ప్రయోజనాలని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ, గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుల మధ్య తేడాలను ప్రజలే పరిశీలించాలని సీఎం సూచించారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నప్పటికీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదని, అయితే ఈ ప్రాంతం పట్ల ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని చెప్పారు. గౌరెల్లి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ రంగంలో విప్లవాత్మక మార్పులు




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**రాష్ట్రంలో ధరణి వ్యవస్థను బంగాళాఖాతంలో పడేయాలని, లోపభూయిష్టమైన చట్టాలను సవరించాలని ప్రభుత్వం భావించిందని, అదే దిశగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.**

కొత్త చట్టానికి అనుగుణంగా నిబంధనలను స్పష్టంగా రూపొందించామని చెప్పారు. ప్రజలకు అన్యాయం జరిగితే కోర్టు వెళ్లాల్సిన అవసరం లేకుండా, భూ భారతి ద్వారా న్యాయం అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ రెండేళ్ల పాలనపై సచివాలయంలో మీడియాతో మంత్రి వివరాలు బుధవారం వెల్లడించారు. చేపట్టిన సంస్కరణలు, వాటి వల్ల ప్రజలకు కలిగిన లాభాలను వివరించారు. మెరుగైన రెవెన్యూ వ్యవస్థను దశల వారీగా అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. భూ భారతి చట్టం అమలుకాగానే అందిన 9 లక్షల అప్లికేషన్ల పరిష్కారానికి చట్టాన్ని పూర్తిగా అమలు చేస్తున్నామని అన్నారు. ధరణి ద్వారా వచ్చిన 2.45 లక్షల అప్లికేషన్లను కూడా పరిష్కరించామని తెలిపారు. రిజెక్ట్ చేసిన సందర్భాల్లో కూడా 'స్పీకింగ్ ఆర్డర్'తో స్పష్టమైన సమాధానాలు ఇస్తున్నామని తెలిపారు. భూ భారతి చట్టం అమలుకు తర్వాత వెబ్‌సైట్ నిర్వహణను విదేశీ సంస్థ టెర్రాసిస్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఎన్ఐసీకి అప్పగించామని మంత్రి వెల్లడించారు. ల్యాండ్స్ అండ్ రికార్డుల వ్యవస్థతో పాటు, ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లుగా సర్వే-రిజిస్ట్రేషన్ వ్యవస్థలను అనుసంధానం చేసే పనిలో ఉన్నామని తెలిపారు. కొత్త ఏడాదిలో ఈ ప్రక్రియ అమలు అవుతుందని చెప్పారు. ధరణి యాప్‌లో పారదర్శకత లేకపోవడంతో, అన్ని ఆప్షన్లతో కొత్త వెబ్‌సైట్‌ను ఎన్ఐసీ రూపొందించి వచ్చే నెలలో ప్రారంభిస్తామని తెలిపారు. సర్వే మ్యాప్ లేకుండానే భూములు రిజిస్టర్ కానీయకుండా పూర్తి స్థాయి రికార్డుల వ్యవస్థను రూపొందిస్తున్నామని అన్నారు. దశాబ్దాలుగా రాష్ట్రంలో 33 జిల్లాలలో 413 గ్రామాలకు నక్షాలు లేవని, పైలట్‌గా నాలుగు ప్రాంతాల్లో ఐదు రెవెన్యూ గ్రామాలకు నక్షాలు, కొత్త సర్వే నంబర్లు జారీ చేశామని మంత్రి తెలిపారు. 1948లో 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ఇప్పుడు అవి 2.42 కోట్లకు చేరాయని చెప్పారు. ఈ సమస్యకు ముగింపు పలకడానికి ఐదు గ్రామాల్లో కొత్త సర్వే నంబర్లు, భూమికి హద్దులు నిర్ణయించామని తెలిపారు. భూధార్ నంబర్లు కూడా సిద్ధమయ్యాయని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. మొత్తం 413 గ్రామాలకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్టు తెలిపారు. రెండో దశలో 373 గ్రామాలు, మూడో దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో సర్వే, బౌండరీలు, భూధార్ కార్డులు జారీ చేసే పనులు జరుగుతాయని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేయడానికి కొత్త మోడల్‌గా వివాదాలేని భూమి రికార్డులను రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. లైసెన్స్డ్ సర్వేయర్ల వ్యవస్థను కూడా పారదర్శకంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దరఖాస్తు చేసిన 10,450 మందిలో అర్హులైన 3,490 మందికి ఇప్పటికే నియామక పత్రాలు అందజేశామని అన్నారు. ప్రతి మండలానికి నలుగురు నుంచి ఆరుగురు సర్వేయర్లను ఎంపిక చేస్తామని చెప్పారు. రెండో దశలో 7,000 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించి, అర్హులకు లైసెన్స్ జారీ చేస్తామని తెలిపారు. సర్వేయింగ్‌కు అవసరమైన రోవర్స్ పరికరాలను 400 కొనుగోలు చేసి పదిరోజుల్లో పంపిణీ చేస్తామని చెప్పారు. సర్వే వ్యవస్థను దశల వారీగా ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజాసేవలో వినియోగిస్తామని అన్నారు. మునుపటి ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, అందుకే పునర్నిర్మాణంలో కొంత ఆలస్యం జరుగుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కూడా సంస్కరణలు చేపట్టి, స్లాట్ విధానంతో ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 59 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 ప్రాంతాలకు ఏకీకరించే పనులు జరుగుతున్నాయని, గచ్చిబౌలిలో తొలి కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు. సాదాబైనామా అప్లికేషన్ల సంఖ్య 9.25 లక్షలకు చేరిందని, వీటిని భూ భారతి ద్వారా క్లియర్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఫారెస్ట్, దేవాదాయం, వక్ఫ్, ప్రభుత్వం భూములకు సంబంధించిన సాదా బైనామాలు రిజిస్టర్ చేయలేమని స్పష్టం చేశారు. ధరణి పెండింగ్ అప్లికేషన్లు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9 లక్షల దరఖాస్తులను జనవరి చివరికల్లా పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే ట్రిబ్యునల్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అవినీతి జరిగినందున రెండు జిల్లాల్లో పైలట్‌గా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించామని, అక్రమాలను త్వరలో వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. జీఓ 58, 59 అప్లికేషన్లను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. నిషేధిత జాబితాను పబ్లిక్‌లో ఉంచి, అభ్యంతరాలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములను దొంగ పత్రాలతో స్వంతంగా చూపించే వారిని వదలబోమని స్పష్టం చేశారు. హైదరాబాద్ అభివృద్ధి, జీహెచ్ఎంసీ విస్తరణ, 2047 నగర ప్రణాళికలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి హైదరాబాద్‌ను ప్రపంచంలో ఒక మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక భూముల విషయంలో ఎలాంటి పాలసీ లేకుండా కన్వర్షన్లు జరిగినట్టు ఆరోపించారు. అవసరమైతే ఆ పత్రాలను కూడా బయట పెడతామని హెచ్చరించారు. జర్నలిస్టులకు త్వరలో అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్టు తెలిపారు.

# పారిశ్రామికవేత్తల కోసమే హిల్ట్ పాలసీ

**ఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

**తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా , పారిశ్రామికవేత్తలకు మాత్రమే లబ్ధి చేకూర్చే విధంగా హిల్ట్ పాలసీ రూపొందించిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు.**

దిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. "పారిశ్రామిక వేత్తలకు ఒక విధానం, రైతులకు వేరే విధానమా?"




అని ఆయన ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా అవినీతి జీవోను తీసుకొచ్చారని కూడా పేర్కొన్నారు.హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్ లకు అనుమతి ఇస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏమవుతుందో అని ఆయన ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ అమలు అవుతోందని కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.

# కేటీఆర్ నీకు ఆ స్థాయి లేదు

**సంగారెడ్డి (ఏడీఎన్ఎన్) :**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో మీడియాతో బుధవారం ఆయన మాట్లాడుతూ , రాహుల్ గాంధీ త్యాగాల కుటుంబానికి చెందిన వ్యక్తి అని, కేటీఆర్ కుటుంబం తెలంగాణ ఉద్యమంలో రాజకీయ ప్రయోజనాల కోసం పాలుపంచుకున్నారని విమర్శించారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదని, కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి మరోసారి మాట్లాడకూడదని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీగా, తెలంగాణ




రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీగా ఉన్నాయని, కేటీఆర్ ఇక్కడ మాత్రమే రాజకీయాలు చేస్తారని, రాహుల్ గాంధీని విమర్శిస్తే మానవీయంగా విడిచిపెట్టనని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# కోట్లల్లో కోకాపేట భూములు



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**కోకాపేట నియోపొలిస్ భూముల మూడో విడత ఈవేలం భారీ స్పందన మధ్య విజయవంతంగా పూర్తైంది. హైదరాబాద్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో కోకాపేట ఒకటి కావడంతో, అక్కడి రియల్ ఎస్టేట్ విలువలు నిరంతరం పెరుగుతున్నాయి.**

ఈ కారణంగా ఈవేలంలో భారీ పోటీ నెలకొంది. బుధవారం నిర్వహించిన వేలంలో ప్లాట్ నెంబర్ 19, 20లకు చెందిన 8.04 ఎకరాల భూమిని అధికారలు ఈవేలం ద్వారా అమ్మకానికి ఉంచారు. ఇందులో ప్లాట్ నెంబర్ 19కు ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20కు ఎకరానికి రూ.118 కోట్ల అత్యధిక ధర పలికింది. దీంతో ఒక్క రోజులోనే హెచ్ఎండీఏకు సుమారు వెయ్యి కోట్ల ఆదాయం లభించింది. ఈ మూడు విడతల్లో మొత్తం ఆరు ప్లాట్లలోని 27 ఎకరాల భూమి అమ్మకాల ద్వారా ఇప్పటి వరకు హెచ్ఎండీఏ ఖాతాలో రూ.3,708 కోట్ల భారీ ఆదాయం చేరింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో వేలం వేయనున్నట్లు ముందుగా ప్రకటించిన హెచ్ఎండీఏ, ఆ ప్రక్రియలో భాగంగా మూడో విడతను పూర్తి చేసింది. మిగిలిన భూములైన కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈవేలం నిర్వహించనుంది. రాబోయే వేలాల్లో కూడా భారీ ధరలు పలికే అవకాశం ఉన్నట్లు రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# పేగుబంధం కంటే పైసలే ఎక్కువయ్యాయా

**కరీంనగర్/హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

**ఈ సమాజంలో పేగుబంధం కంటే పైసలే ఎక్కువనుకోవడం దురదృష్టకరమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు.కరీంనగర్ జిల్లా రామడుగులో జరిగిన దారుణ హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది.**

కేవలం రూ. 4 కోట్లకు బీమా సొమ్ము కోసం సొంత అన్నను ఘోరంగా హతమార్చిన తమ్ముడితో పాటు మరో ఇద్దరి నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బీమా సంస్థ ప్రతినిధులు అనుమానం వ్యక్తం చేసి దర్యాప్తుకు డిమాండ్ చేయడంతో, ఈ పకడ్బందీ కుట్ర వెలుగులోకి వచ్చింది.ఈ సంఘటనపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ సజ్జనార్ బుధవారం ఎక్స్ వేదికగా ఉద్వేగంగా స్పందించారు. "బీమా డబ్బుల కోసం తోడబుట్టినవాడినే కడతేర్చిన ఈ ఘటన, మన సమాజం ఎటు పోతోందో తెలియజేస్తోంది. పేగుబంధం కంటే పైసలే ఎక్కువనుకోవడం అత్యంత దురదృష్టకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "కష్టమొస్తే నోట్లు కన్నీళ్లు తుడవవని , తోడబుట్టిన వాడు, కన్నవారు, కష్టంలో నిలిచే స్నేహితుడే నిజమైన ఆస్తులని , దురాశ కోరల్లో చిక్కుకుని మానవత్వాన్ని బలి పెట్టొద్దని సజ్జనార్ అన్నారు . డబ్బు శాశ్వతం కాదు... మనిషి, మమకారాలే ముఖ్యం" అంటూ ఆయన ప్రజలకు సందేశం ఇచ్చారు.



# ఐఏఎస్ అరవింద్ కుమార్ పై ఏసీబీ దర్యాప్తు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**ఫార్ములా ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న ఐఏఎస్ అరవింద్ కుమార్ పై చర్యలకు అనుమతి కోరుతూ డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ ఇండియన్ గవర్నమెంట్ ఏజన్సీ కి ఛీఫ్ సెక్రటరీ రామకృష్ణరావు లేఖ రాశారు.**

ఈ కార్ రేస్ కేసులో యాంటి కరప్షన్ బ్యూరో ఇచ్చిన నివేదిక పై చర్యలు చెపట్టేందుకు సీఎస్ డిఓపిటికి లేఖ రాశారు. డిఓపిటి అనుమితి ఇచ్చిన నేపథ్యంలో సీఎస్ ఏసీబీకి ఆదేశాలు జారీ చేయనున్నారు. కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు గవర్నర్ కూడా అనుమతి అందించారు. ఫార్ములా ఈ కార్ కేసులో ఛార్జ్ షీట్ దాఖలు చేసేందుకు ఏసీబీ సన్నద్ధమై ఉందని సమాచారం ఉంది. కేసులో ఏ1గా పేర్కొన్న కేటీఆర్, ఏ2గా పేర్కొన్న అరవింద్ కుమార్‌ను ఏసీబీ అధికారులు రెండు సార్లు విచారించి స్టేట్ మెంట్ రికార్డు చేశారు.




# కరీంనగర్ లో భారీ దొంగతనం

**రూ.35 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, చోరీ**

**కరీంనగర్ (ఏడీఎన్ఎన్) :**

**కరీంనగర్‌లోని శివనగర్ ప్రాంతంలో భారీ దొంగతనం జరిగింది. విజేత మనోహర హెవెన్స్ అపార్ట్ మెంట్‌లో వరుసగా రెండు ఫ్లాట్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు మొత్తం రూ.35 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలను దోచుకెళ్లారు.**

అర్ధరాత్రి 2 గంటల సమయంలో ముగ్గురు దుండగులు ముందుగా పరిసరాల్లో రెక్కీ నిర్వహించి, తరువాత అపార్ట్ మెంట్‌లోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డట్లు సీసీ కెమెరా దృశ్యాల్లో స్పష్టంగా రికార్డు అయింది. మొదటి అంతస్తులోని సందీప్ ఫ్లాట్‌లో దొంగలు రూ.60 వేల నగదు, 12 తులాల బంగారం, 80 తులాల వెండి, ల్యాప్‌టాప్‌లతో కలిపి మొత్తం రూ.20 లక్షల విలువైన వస్తువులను దోచుకెళ్లారని , నాలుగో అంతస్తులోని కిష్టయ్య ఫ్లాట్‌లో 8.3 తులాల బంగారం, వెండి ఆభరణాలు తదితర వస్తువులు సుమారు రూ.15 లక్షల విలువైన సొమ్మును దోచుకున్నట్టు టూ టౌన్ పోలీసుల వెల్లడించారు. చోరీ సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ సృజన్‌రెడ్డి అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు . సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దొంగల గుర్తించి , దర్యాప్తు వేగవంతం చేసినట్టు తెలిపారు.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar

గురువారం | హైదరాబాద్
04.12.2025
www.manasarkar.com

## రాశి ఫలాలు

**04-12-2025 గురువారం**

**మేషం:**
వ్యాపారాలు లాభసాటిగా సాగిపోతాయి. ఆర్థిక, ఆస్తి విషయాల్లో మీ సరికొత్త నిర్ణయాలు సత్ఫలితాలనిస్తాయి. ఎటువంటి ప్రయత్నం తలపెట్టినా కలిసి వస్తుంది. కుటుంబ వ్యవహారాలు చాలా వరకు చక్కబడతాయి. వ్యక్తిగత విషయాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

**వృషభం:**
మనసులోని కోరిక నెరవేరుతుంది. సమాజంలో పెద్దలతో పరిచయాలు ఏర్పడతాయి. వివాహ, ఉద్యోగ ప్రయత్నాల్లో ఒకటి రెండు శుభవార్తలు వింటారు. సోదరులతో వివాదం సమసిపోతుంది. కుటుంబ జీవితంలో ప్రశాంత పరిస్థితులు నెలకొంటాయి.

**మిథునం:**
వృత్తి, వ్యాపారాలు లాభాల బాట పడతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు సఫలం అవుతాయి. ప్రయాణాల్లో ఆశించిన ఫలితాలను సాధిస్తారు. కొత్త వ్యక్తులు పరిచయం అవుతారు.

**కర్కాటకం:**
ఆదాయం నిలకడగా సాగిపోతుంది. ఒకరిద్దరు బంధుమిత్రులకు ఆర్థికంగా సహాయం చేయడం జరుగుతుంది. సొంత పనుల మీద ఎక్కువగా శ్రద్ధ పెట్టడం మంచిది. ఆర్థిక వ్యవహారాల్లో సన్నిహితుల వల్ల నష్టపోయే సూచనలున్నాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

**సింహం:**
ఆదాయం నిలకడగా సాగిపోతుంది. ఒకరిద్దరు బంధుమిత్రులకు ఆర్థికంగా సహాయం చేయడం జరుగుతుంది. సొంత పనుల మీద ఎక్కువగా శ్రద్ధ పెట్టడం మంచిది. ఆర్థిక వ్యవహారాల్లో సన్నిహితుల వల్ల నష్టపోయే సూచనలున్నాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

**కన్య:**
వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా ముందుకు సాగుతాయి. సోదర వర్గంతో ఆస్తి వివాదం పరిష్కారం అయ్యే సూచనలున్నాయి. ఉద్యోగం మారడానికి అవకాశం ఉంది. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. ఆర్థిక పరిస్థితి చాలావరకు అనుకూలంగా ఉంటుంది.

**తుల:**
ఉద్యోగంలో మీ పని తీరు అధికారులకు బాగా నచ్చుతుంది. వృత్తి, వ్యాపారాలు నల్లేరు మీద బండిలా సాగిపోతాయి. ఉద్యోగం మారడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రభుత్వ ఉద్యోగులకు సమయం బాగా అనుకూలంగా ఉంది. ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది. పిల్లల నుంచి శుభ వార్తలు వింటారు. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాలకు తప్పకుండా సానుకూల స్పందన లభిస్తుంది.

**వృశ్చికం:**
ఆర్థిక వ్యవహారాలు ఉత్సాహంగా సాగిపోతాయి. ప్రారంభించిన పనులు సంతృప్తికరంగా పూర్తవుతాయి. ప్రయాణాల వల్ల ఆశించిన ప్రయోజనాలు సిద్ధిస్తాయి. కుటుంబ సభ్యులతో తొందరపడి మాట్లాడడం మంచిది కాదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

**ధనస్సు:**
లక్ష్యాలు, బాధ్యతలను సంతృప్తికరంగా నిర్వర్తించగలుగుతారు. ఆధ్యాత్మిక వ్యవహారాలపై దృష్టి సారిస్తారు. ప్రస్తుతానికి ప్రయాణాలను వాయిదా వేయడం మంచిది. నిరుద్యోగులకు సమ యం అనుకూలంగా ఉంది. అదనపు ఆర్థిక ప్రయత్నాలు బాగా ఫలిస్తాయి. ఆరోగ్యం పరవాలేదు.

**మకరం:**
ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ఆలోచనలు, కొత్త నిర్ణయాలతో ముందుకు వెడతారు. ఆదాయానికి లోటుండకపోవచ్చు. వృత్తి, వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలను పూర్తి చేయడంలో స్నేహితుల సహాయం లభిస్తుంది. కుటుంబ సభ్యులతో విహార యాత్రకు వెడతారు.

**కుంభం:**
కొత్త ఉద్యోగ ప్రయత్నాల్లో శుభవార్త అందుతుంది. వివాహ ప్రయత్నాలు సానుకూలపడతాయి. అనవసర పరిచయాలకు దూరంగా ఉండడం మంచిది. ఆదాయ ప్రయత్నాలు ఫలించి అవసరాలు తీరుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు విజయవంతంగా పూర్తవు తాయి.

**మీనం:**
ఆస్తికి సంబంధించిన క్రయ విక్రయాల్లో లాభాలు పొందడానికి అవకాశం ఉంది. కుటుంబ సభ్యుల ద్వారా ఆకస్మిక ధన ప్రాప్తి సూచనలున్నాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. చేపట్టిన పనులు సంతృప్తికరంగా పూర్తవుతాయి. వృత్తి, వ్యాపారాలు బాగా లాభసాటిగా సాగిపోతాయి.



## విజయవాడలో అక్రమ
# నిర్మాణాలు కూల్చి వేత

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

విజయవాడ భవానీపురంలో మొత్తం 42 నిర్మాణాలను అధికారులు గురువారం కూల్చివేశారు. కోర్టు ఆదేశాల మేరకు భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలు చేపట్టారు. లక్ష్మీ రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో, వివాదాస్పద నిర్మాణాలు తొలగించడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. కూల్చివేతలు జరిగిన ప్రాంతం చుట్టూ కోఆపరేటివ్ సొసైటీ ప్రహరీ గోడ నిర్మాణం కూడా ప్రారంభమైంది. కూల్చివేతలతో 42 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. గత 25 ఏళ్లుగా నివసిస్తున్న గృహాల నుంచి ఒక్కసారిగా రోడ్డున పడుతున్నామని బాధితులు కన్నీటి పర్యంతమై ఆవేదన వ్యక్తం చేశారు. తమ గృహాలను కాపాడుకునేందుకు వారు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అయితే అధికారులు కోర్టు ఆదేశాలు అమలు చేయడమే తప్ప మరో మార్గం లేదంటూ కూల్చివేతలను కొనసాగించారు. బాధితుల నిరసనలు, అడ్డంకుల మధ్య కూడా చర్యలు ఆపకుండా అధికారులు ముందుకు సాగారు.

## కాక్లియర్ ఇంప్లాంట్ తో
# బ్రహ్మ చెవుడు ఉన్నా వినొచ్చు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



అత్యంత విజయవంతమైన వైద్య ఆవిష్కరణల్లో కాక్లియర్ ఇంప్లాంట్ అత్యంత ప్రయోజనకారిగా చెప్పవచ్చు. బ్రహ్మ చెవుడు ఉన్న వాళ్లకి తిరిగి వినికిడి శక్తి ఇచ్చే అద్భుత పరికరం ఇది. వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. ఈ పరికరం శిశువుల దగ్గర నుండి వృద్ధుల వరకూ వినే భాగ్యాన్ని కలుగజేస్తోంది. సాధారణ వినికిడి సాధనాలు కేవలం బయటి చెవి సమస్యలనే తీర్చగలవు. లోపలి చెవి సమస్యలు ఇలాంటి పరికరాలకు లొంగవు. అలాంటి వారికి సంజీవని లాంటిది ఈ కాక్లియర్ ఇంప్లాంట్. ఇది వినికిడికి మూలమైన శ్రవణనాడిని ప్రేరేపించి, శబ్దాలు వినిపించేలా చేస్తుంది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. దీనిలో రిసీవర్ స్టిమ్యులేటర్ భాగాన్ని చెవి వెనకాల ఆపరేషన్ చేసి, లోపల అమరుస్తారు. దీనికి గల ఎలక్ట్రోడ్ తీగలను కర్ణభేరి కింద నుండి, కాక్లియర్ ఇంప్లాంట్ ను ప్రవేశ పెడతారు. మైక్రోఫోన్, స్పీచ్ ప్రాసెసర్, ట్రాన్స్ మీటర్లను చెవి వెనకాల అమరుస్తారు. ఈ రెండు అయస్కాంతం సాయంతో లింక్ అయి ఉంటాయి. వెలుపలి భాగంలో మైక్రోఫోన్ గ్రహించిన ధ్వనులు సంకేతాలుగా మారి, లోపల అమర్చిన భాగానికి ప్రసారమవుతాయి. ఇవి విద్యుత్ ఎలక్ట్రోడ్ తీగ ద్వారా క్లాకియాలోకి చేరతాయి. వాటితో శ్రవణ నాడీ కణాలు ప్రేరేపితమై ఆ సమాచారాన్ని మెదడుకు పంపిస్తాయి. వాటిని మెదడు విశ్లేషించి, ధ్వని రూపంలో వినిపిస్తుంది. ఈ పద్ధతిలో చెవి వెనుక భాగానికి మాత్రమే లోకల్ గా మత్తు ఇచ్చి శస్త్రచికిత్స చేయటమూ సాధ్యమవుతోంది. దీనితో ఎలాంటి ముప్పులూ ఉండవు. ఈ శస్త్రచికిత్సకు ముందు మెదడుపొర వాపు రాకుండా న్యూమోవాక్, హిబ్ టీకాలు తీసుకోవడం తప్పనిసరి.

- నవజాత శిశువులకు వినికిడి పరీక్ష చేయించడం వల్ల ముందుగానే వినికిడి లోపాన్ని గుర్తించవచ్చు. 6 నుండి 12 నెలల్లోనే కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చాలని అంతర్జాతీయ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. లేకపోతే మూగవారుగా మిగిలిపోయే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- అలాగే మాటలు వచ్చిన తర్వాత పిల్లలలో వినికిడి లోపాలు గుర్తిస్తే 6 ఏళ్ల లోపే వారికి ఈ చికిత్స చేయించడం మంచిది.
- పెద్దవారిలో వినికిడి లోపాలు గుర్తిస్తే ఈ చికిత్సతో రోజువారీ పనులు హాయిగా చేసుకోగలుగుతారు.

ఈ పరికరాన్ని ఖచ్చితంగా అమర్చడానికి రోబోటిక్ పద్ధతిని కూడా ఉపయోగిస్తున్నారు.

# మహిళల్లో ఐరన్ లోపం నివారించేదెలా ?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




ఐరన్ మన శరీరానికి ఒక ముఖ్యమైన ఖనిజం. ఇది హిమోగ్లోబిన్ తయారు చేయడానికి అవసరం. హిమోగ్లోబిన్ మన శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ ను చేరవేస్తుంది. అందుకే ఐరన్ లోపం ఆరోగ్యానికి చాలా హానికరం అంటారు వైద్యులు. ముఖ్యంగా పురుషులతో పోలిస్తే మహిళల్లో ఐరన్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. ఐరన్ లోపం వల్ల అనీమియా వస్తుంది, దీనివల్ల అలసట, బలహీనత, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నెలసరి సమయంలో రక్తం పోవడం వల్ల శరీరంలో ఐరన్ స్థాయిలు తగ్గుతాయి. సరిగా ఆహారం తీసుకోకపోవడం లేదా కొన్ని ఆరోగ్య సమస్యల వల్ల ఐరన్ లోపం రావచ్చు. ఐరన్ మన శరీరానికి ఒక ముఖ్యమైన ఖనిజం. ఇది హిమోగ్లోబిన్ తయారు చేయడానికి అవసరం. ఈ ఐరన్ లోపించడం వల్ల మహిళల్లో ఎన్నో రకాల అనారోగ్యాలు తలెత్తుతాయి. అలసట, నీరసం.. వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు.. నెలసరి సమయంలో బ్లీడింగ్‌లో హెచ్చుతగ్గులు, గర్భం ధరించలేకపోవడం, ఒకవేళ గర్భం వచ్చినా అది నిలవకపోవడం.. వంటి ప్రత్యుత్పత్తి సమస్యలూ తప్పవంటున్నారు నిపుణులు. గర్భిణీలు, బాలింతలకు గర్భధారణ, పాలిచ్చే సమయంలో ఎక్కువ ఐరన్ అవసరం అవుతుంది. సరైన ఆహారం లేకపోవడం. ఐరన్ ఉన్న ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల ఐరన్ లోపం ఏర్పడుతుంది. సీలియాక్ వ్యాధి, అల్సరేటివ్ కొలైటిస్ వంటి జీర్ణ సంబంధిత వ్యాధులు వల్ల కూడా ఐరన్ లోపిస్తుంది. అల్సర్లు లేదా క్యాన్సర్ వంటి కారణాల వల్ల అధిక రక్తస్రావం జరిగితే ఐరన్ లోపం ఏర్పడుతుంది. ఈ లోపాన్ని తగ్గించడానికి మహిళలు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాలైన మాంసం, గుడ్లు, ఆకుకూరలు, బలవర్ధకమైన తృణధాన్యాలు తీసుకోవాలి. ఈ ఆహారాలతో పాటు విటమిన్ సి శరీరం ఐరన్‌ను బాగా గ్రహించడంలో సహాయపడుతుంది. నారింజ, నిమ్మ, స్ట్రాబెర్రీలు వంటివి తీసుకుంటే మంచిది. ఐరన్‌ను పెంచే ఆహారాలలో ఆకు కూరలు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటాయి. వీటితోపాటు నిమ్మకాయను కూడా ఆహారంలో భాగంగా తినడం వల్ల ఐరన్ లోపాన్ని అరికట్టడంలో సహాయపడుతుంది. అలాగే టొమాటోలో లైకోపీన్, విటమిన్ సి ఎక్కువగా ఉంటాయి. ఇవి ఆకుపచ్చ కూరగాయలలో ఉండే పోషకాల మాదిరిగానే ఐరన్‌ను పెంచుతుంది. ఐరన్‌లోపంతో బాధపడేవారు ఆహారంలో పెరుగు కూడా చేర్చుకోవాలి. పెరుగు తీసుకోవడం వల్ల ఎన్నో పోషకాలు శరీరానికి అందుతాయి. అల్లం, వెల్లుల్లి ఆహారం రుచిని పెంచడమే కాకుండా ఐరన్ శోషణను మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటితోపాటు చేప, మాంసం, లివర్, చికెన్ లతోపాటు పప్పుధాన్యాలు, టోఫు, పాలకూర, బీన్స్, క్వినోవా, తృణధాన్యాలు, సిట్రస్ పండ్లు వంటి వాటిల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది.

# స్క్రబ్ టైఫస్ కారకాలు, నివారణ చర్యలు

- సాధారణ జ్వరంలా ఉండే స్క్రబ్ టైఫస్
- చికిత్స ఆలస్యం చేస్తే ప్రాణాంతకం
- సూక్ష్మ పురుగు కాటుతో వ్యాధి వ్యాప్తి
- పొలాల్లో జాగ్రత్తగా ఉండాలని వైద్యుల హెచ్చరిక

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**





ఏపీలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్నాయి. స్క్రబ్ టైఫస్‌లో లక్షణాలు సాధారణ జ్వరంలాగా ఉంటాయి. అందుకే చాలా మంది గుర్తించలేరు. జ్వరం తగ్గకపోవడంతో పరీక్షలు చేయించుకుంటే స్క్రబ్ టైఫస్ అని తేలడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇది ప్రాణాంతకం కావడంతో టెన్షన్ ఎక్కువయ్యింది. ఈ వ్యాధికి మొదటివారంలో అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, బాడీ పెయిన్స్, అలసట, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటాయి. చిగ్గర్లు కాటు వేసిన చోట నల్లటి మచ్చ ఏర్పడుతుంది. ఇది స్క్రబ్ టైఫస్కు గుర్తు. పంట కోత-పొలం పనుల సమయంలో చిగ్గర్లు సోకే ప్రమాదం ఉంది. అలాగే తడి నేల కూడా వీటి వ్యాప్తిని ప్రోత్సాహిస్తుంది. జ్వరం వస్తే వైరల్ ఫీవర్‌గా భావించి మందులు వేసుకుని వైద్య సహాయం తీసుకోకపోవడం వల్ల కూడా కేసులు పెరుగుతున్నాయి. సాధరణ జ్వరమేనని చికిత్స తీసుకోకపోతే.. ఊపిరితిత్తులు ఇన్ఫెక్షన్ కు గురి అవుతాయి. మైకం రావడం, లో బీపీ, అవయవాల పనితీరు దెబ్బతినడం, అత్యవసర ఆరోగ్య ప్రమాదం ఏర్పడటం జరుగుతుంది. అందుకే దీనికి ముందుగానే చికిత్స తీసుకోవాలి. వైద్యులు IgM ELISA, PCR వంటి టెస్టు చేసి నిర్ధారిస్తారు. ఒకవేళ సమస్య ఉందంటే యాంటీ బయాటిక్స్ చికిత్స చేస్తారు. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే ఒకటి, రెండు రోజుల్లో జ్వరం తగ్గుతుంది. అలక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుంది. పొలాలు, గడ్డి పొదలు, అడవులు, తడి నేల, పశువుల మేత ప్రాంతాల్లో ఈ చిగ్గర్లు ఎక్కువగా ఉంటాయి. చాలామంది ఈ ప్రదేశాలకు వివిధ అవసరాల కోసం వెళ్తుంటారు. దీనివల్ల బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి స్క్రబ్ టైఫస్ కి కారణమవుతుంది. ఈ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవాలి. పొలాల్లో పనిచేసేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. సాక్స్ వేసుకోవడం, ఫుల్ హ్యాండ్స్ ఉన్న దుస్తులు వేసుకోవడం చేస్తే మంచిది. ఇన్సెక్ట్ రిపెలెంట్ వాడితే మంచిది. ఇంటి దగ్గర్లో గడ్డి పొదలు లేకుండా చూసుకోవాలి. ప్రభుత్వం-స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో ఫీవర్ క్యాంపులు నిర్వహించాలి. స్క్రబ్ టైఫస్ అనేది నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం. కానీ సులభంగా చికిత్స చేయగల వ్యాధి. కాబట్టి దీనిపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. లేదంటే అది చివరికి ప్రాణాంతకమవుతుందని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు.

## భారీ ప్రైజ్‌మనీతో ఏకాగ్రా ఇంటర్నేషనల్
# ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్

- డిసెంబర్ 20-21 తేదీల్లో ప్రారంభం
- విజేతలకు ₹22,22,222 బహుమతి

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :**




తెలంగాణలో మొట్టమొదటిసారిగా రూ. 22,22,222 నగదు బహుమతులతో కూడిన అతిపెద్ద ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ ను ఏకాగ్రా చెస్ అకాడమీ నిర్వహిస్తోంది. డిసెంబర్ 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ రెండు రోజుల టోర్నమెంట్ జరగనుంది. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏకాగ్రా ఇంటర్‌నేషనల్ చెస్ టోర్నమెంట్ వైస్ చైర్మన్, ప్రముఖ పాత్రికేయుడు, నంది అవార్డు గ్రహీత షరీఫ్ మహ్మద్ మాట్లాడుతూ – "తెలంగాణలో ఇంత పెద్ద ఓపెన్ రాపిడ్ టోర్నమెంట్ ఇదే తొలిసారి. మొత్తం రూ. 22,22,222 నగదు బహుమతులను విజేతలకు పంచుతాం" అని ప్రకటించారు. సాధారణ ఆటగాళ్లకు ఎంట్రీ ఫీజు : రూ. 5,000 ఉంటుంది. గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు, మహిళా GM & WIMలకు - ఉచిత ఎంట్రీ ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ రూ. 5,000తో డిసెంబర్ 15 వరకు ఉండగా, ఆలస్య రుసుము రూ. 6,000తో - డిసెంబర్ 18 వరకు గడువు ఉంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో www.ekagrachessacademy.com లో చేసుకోవచ్చని, +91 79813 58105, +91 62646 46422, +91 78428 43999 నంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే పలువురు ప్రముఖ గ్రాండ్ మాస్టర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ట్విల్ కోవు సెరిజ్ (నెదర్లాండ్స్), సావ్‌చెంకో బోరిస్ (రష్యా), పెట్రోవ్ మారియన్ (బల్గేరియా), రాయ్ చౌదరి సప్తర్షి (ఇండియా) తదితరులు ఉన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ గిరీష్ రెడ్డి మాట్లాడుతూ – "2020లో ఏకాగ్రా చెస్ అకాడమీ ప్రారంభించినప్పటి నుంచి వేలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చాం. 2022లో నిర్వహించిన మా ఫిడే రేటెడ్ టోర్నమెంట్‌లో 1,300కు పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈసారి మరింత ఘనంగా నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. గిరీష్ మాట్లాడుతూ – "ఈ టోర్నమెంట్‌లో బాగా రాణించిన విద్యార్థులను ఏకాగ్రా చెస్ స్కాలర్‌షిప్ కార్యక్రమంలో ఎంపిక చేస్తాం అని చెప్పారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌమ్య జానూ మాట్లాడుతూ చెస్ ఆడటం ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తి బాగా పెరుగుతాయి" అని పేర్కొన్నారు. ప్రైమ్9 న్యూస్ ఛానెల్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆసక్తి కనబరుస్తోంది. తెలంగాణ చెస్ ఆటగాళ్లకు ఇది అరుదైన అవకాశమని వర్ధమాన నటుడు, మోడల్ సోహెల్ హమీద్ తెలిపారు.



## పసికందును కాపాడిన
# వీధికుక్కలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఇటీవల కాలంలో వీధికుక్కల స్వైరవిహారం పసిబిడ్డలపై దాడుల వార్తలతో ఆందోళనకు గురవుతున్నాం. అలాంటిది ఒక పసికందుకు వీధి కుక్కలు కాపలాగా మారి రక్షణ ఇచ్చిన వార్త అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. కనికరం లేకుండా కన్నవారు అప్పుడే పుట్టిన పసికందును పశ్చిమ బెంగాల్ లోని నదియా జిల్లాల్లో వదిలేశారు. అక్కడి రైల్వే వర్కర్స్ కాలనీలో ఒక బాత్ రూమ్ వద్ద ఉన్న దుప్పటిలో చుట్టి ఉన్న నవజాత శిశువును గుర్తించారు స్థానికులు. రాత్రంతా ఆ పసికందుకు కుక్కలు రక్షణగా ఉన్నట్లు తెలిసింది. కుక్కల మధ్యలో చిన్నారిని గుర్తించిన స్థానికులు బిడ్డను ఆసుపత్రికి తరలించారు. ఆ కుక్కలు బిడ్డకు ఎలాంటి హానీ చేయకుండా కాపాడాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరు వదిలేసి వెళ్లారో గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

## ఐఏఎస్ అధికారికి
# హైకోర్టు షాక్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




ఐఏఎస్ అధికారి రోనాల్డ్ రోస్‌కు సంబంధించిన కేటాయింపు వివాదం మరో కీలక మలుపు తిరిగింది. రోసును తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులపై, తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. గత ఏడాది అక్టోబర్‌లో డీవోపీటీ ఆయన్ను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, రోనాల్డ్ రోస్ వాటిని క్యాట్‌లో సవాల్ చేశారు. దీనిపై విచారణ జరిగిన క్యాట్ స్థానికత ప్రమాణాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయన్ను తెలంగాణకు కేటాయించాలని ఆదేశించింది. అయితే ఈ నిర్ణయాన్ని డీవోపీటీ హైకోర్టులో సవాల్ చేయడంతో, ట్రైబ్యునల్ ఉత్తర్వులను నిలిపివేస్తూ హైకోర్టు బుధవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది..




# జీహెచ్ఎంసీ విస్తరణ పూర్తి
## నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి విస్తరణపై తెలంగాణ ప్రభుత్వం అధికారిక ప్రకటన బుధవారం విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్-1955లో వచ్చిన తాజా ఆర్డినెన్స్ ఆధారంగా విస్తరణకు అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌ను జీహెచ్ఎంసీ పరిధిలోకి అధికారికంగా చేర్చుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది.తద్వారా, జీహెచ్ఎంసీ ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారనుంది. ఈ సంబంధించిన ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు జారీ చేశారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు చెందిన 27 మున్సిపాలిటీల విలీన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత మున్సిపాలిటీల రికార్డులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో రికార్డులను స్వాధీనం చేసుకుని, ప్రత్యేక ప్రొఫార్మాల ద్వారా వివరాలను సిద్ధం చేసి జీహెచ్ఎంసీకి పంపాలని సూచించారు. 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు నిర్వర్తించాల్సిన బాధ్యతల జాబితాను కూడా కమిషనర్ కర్ణన్ బుధవారం విడుదల చేశారు.



## సుప్రీం తీర్పుతో
# బంగ్లాదేశ్ గర్భిణికి ఊరట

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మానవత్వాన్ని మించిన న్యాయం లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పుతో బంగ్లాదేశ్ గర్భిణికి ఊరట కలిగింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీం తీర్పుకు తలవంచక తప్పలేదు. భారతీయ పౌరసత్వాన్ని నిరూపించుకోలేకపోయారనే కారణంగా ఈ ఏడాది జూన్ లో పశ్చిమ బెంగాల్ కు చెందిన సునాలీ ఖాతున్ అనే గర్భిణిని, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడు సహా ఆరుగురిని అధికారులు బంగ్లాదేశ్ కు పంపించారు. ఆమె తండ్రి భోదు సేఖ్ ఈ విషయమై కలకత్తా హైకోర్టులో కేసు వేశారు. గుర్తింపు ధృవీకరణ డ్రైవ్ పేరుతో ఈ ఏడాది మే నెలలో వారిని అక్రమంగా నిర్బంధించి, బంగ్లాదేశ్ కు పంపించారని ఆరోపించారు. తాను భారత పౌరుడినని, తన కుమార్తె కూడా భారతీయ పౌరురాలేనని వాదించారు. హైకోర్టు వీరిని తిరిగి తీసుకురావాలని ఆదేశించింది. అయితే పౌరసత్వ ధృవపత్రాలు లేవంటూ సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది కేంద్రం. అయితే సుప్రీంకోర్టు వారిని మానవతా దృక్పథంతో చూడాలని, చట్టపరమైన నిబంధనల కన్నా మానవత్వం గొప్పదని వారిని తీసుకురావాలని తీర్పు ఇచ్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును ప్రత్యేకంగా విచారించింది. వారిని నిఘాలో ఉంచి, వైద్య సంరక్షణ కూడా అందించాలని తీర్పునిచ్చారు.

## సఫారీలపై సెంచరీల
# ధీరుడు కోహ్లీ



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టీమిండియా బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లీ తన పూర్వ వైభవాన్ని తిరిగి చూపిస్తూ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలతో కదం తొక్కాడు. రాంచీ వేదికగా తొలి వన్డేలో 135 పరుగులు, రాయ్‌పూర్‌లో రెండో వన్డేలో 102 పరుగులు సాధించిన కోహ్లీ.. చాన్నాళ్ల తర్వాత 'వింటేజ్' ఫామ్‌ను గుర్తు చేశాడు. ఈ ప్రదర్శనతో కోహ్లీ, దక్షిణాఫ్రికాపై వన్డేల్లో మూడో సెంచరీని నమోదు చేసి, న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును సమం చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో తొలి రెండు వన్డేల్లో డకౌట్ అయినప్పటికీ, మూడో వన్డేలో అజేయ అర్ధ శతకంతో ఫామ్‌ను అందుకున్న కోహ్లీ.. సఫారీలతో సిరీస్‌లో ఆ జోరును కొనసాగించాడు. ముఖ్యంగా రాయ్‌పూర్ వన్డేలో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (105)తో కలిసి 195 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా ఈ రెండు సెంచరీలతో కోహ్లీ తన కెరీర్‌లో మరో మైలురాయిని అధిగమించినట్లయింది.




## ఫ్లాట్ గా ముగిసిన
# స్టాక్ మార్కెట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఈ వారం స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే కదలాడుతున్నాయి. బుధవారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి. ఆర్బీఐ ఎంపీపీ ఉండడంతో పెట్టుబడులు ఆచితూచి పెడుతున్నారు. డిసెంబర్ 5న ఆర్బీఐ వడ్డీ రేట్లపై ప్రకటన చేయనున్న సంగతి తెలిసిందే. నిఫ్టీ మరోసారి 26 వేల మార్కుకంటే దిగువకు పడిపోయింది. డాలరుతో రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో ఏకంగా రూ.90.21 కి పడిపోయింది. మహీంద్రా, ఎన్టీపీసీ, ఎస్బీఐ, టైటాన్ వంటి షేర్లు నష్టాలపాలయ్యాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్ డీఎఫ్ సీ, ఐసీఐసీఐ షేర్లు లాభపడ్డాయి. బంగారం ఔన్సు 4202 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. స్వల్ప లాభాలతోనే ప్రారంభమైన సెన్సెక్స్ చివరికి 31.46 పాయింట్ల నష్టంతో ముగిసింది.



## బంగారంతో పోటీగా
# వెండి పరుగులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

వెండి ధరలు సామాన్యులకి చెమటలు పట్టిస్తున్నాయి. పేదవారి బంగారంగా పేరున్న వెండి నగలు సైతం బంగారంతో పోటా పోటీగా ధరలు పెరిగిపోతున్నాయి. తాజాగా రికార్డు స్థాయిలో వెండి ధర రూ.2 లక్షలు దాటింది. బుధవారం మార్కెట్లో కేజీ వెండి రూ.2,01,000 గా ఉంది. ఇది చరిత్రలోనే గరిష్ఠ ధర. అటు 10 గ్రాముల బంగారం సైతం 24 క్యారెట్లకు రూ.1.32 లక్షల పైనే పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,19,000 ఉంది. రూపాయి విలువ కూడా పతనం కావడంతో ధరలు రాకెట్లా దూసుకెళ్తున్నాయి. గతంలో వెండి పళ్లాలు, గ్లాసులు, పూజసామాగ్రికి మాత్రమే వినియోగించే వెండి ఇప్పుడు అనేక రంగాల్లో వాడుతున్నారు. దంత వైద్యంలో క్రౌన్స్, బ్రిడ్జెస్ వంటి వాటికి ఉపయోగిస్తారు. అలాగే వైద్య ఇమేజింగ్ పరికరాలలో, గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సా పరికరాలలో కూడా బంగారాన్ని వాడుతున్నారు. సోలార్ ప్యానెల్స్, విద్యుత్ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాలలో వెండిని వాడుతున్నారు. వెండికి ఉండే యాంటీ మైక్రోబియల్ లక్షణాల కారణంగా నీటి శుద్ధి, వైద్య ఉపకరణాల తయారీలో వాడుతున్నారు. అలాగే వెండికి కూడా ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి ఉందని పెట్టుబడిదారులు చెప్పడంతో మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీనితో ఈటీఎఫ్ లలో పెట్టుబడులు పెడుతున్నారు.

# సఫారీలు సమం చేశారు

- రెండో వన్డే లో సౌతాఫ్రికా విజయం
- కోహ్లీ , గైక్వాడ్ సెంచరీలు వృధా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



భారత్‌తో జరిగిన రెండో వన్డేలో సౌతాఫ్రికా 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 359 పరుగుల టార్గెట్‌ను సఫారీలు 49.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి చేరుకున్నారు. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం అయ్యింది. సౌతాఫ్రికా ఓపెనర్ ఐడెన్ మార్క్రమ్ 98 బంతుల్లో 110 పరుగులు చేసి శతకం సాధించాడు. మాథ్యూ బ్రిట్జ్కే 64 బంతుల్లో 68, డెవాల్డ్ బ్రెవిస్ 34 బంతుల్లో 54 పరుగులు చేసి హాఫ్ సెంచరీలు కొట్టారు. తెంబా బావుమా 48 బంతుల్లో 46, టోని డి జోర్జి 17 రిటైర్డ్ హర్ట్, కోర్బిన్ బాష్ 26, కేశవ్ మహరాజ్ 10 పరుగులు చేయగా, భారత బౌలర్లలో అర్ష్ దీప్ సింగ్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ శనివారం (డిసెంబర్ 6) విశాఖపట్నంలో జరగనుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ 83 బంతుల్లో 105, విరాట్ కోహ్లీ 93 బంతుల్లో 102 పరుగులు చేసి శతకాలు కొట్టారు. గైక్వాడ్‌కు ఇది వన్డేల్లో తొలి శతకం. చివర్లో కేఎల్ రాహుల్ 43 బంతుల్లో 66* పరుగులు చేసి మెరుపులు మెరిపించాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ 22, రోహిత్ శర్మ 14 పరుగులే చేశారు. రవీంద్ర జడేజా 24* పరుగులు చేసింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ 2, నంద్రీ బర్గర్, లుంగి ఎంగిడి ఒక్కో వికెట్ పడగొట్టారు.

# రోహిత్ , కోహ్లీ జట్టులో లేకపోతే ఆనందమే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత క్రికెట్ దిగ్గజాలు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ లు 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడకుంటే తమకు సంతోషమే అని అఫ్గానిస్థాన్ వికెట్ కీపర్ రహ్మనుల్లా గుర్బాజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అయితే, రోకో లాంటి లెజెండ్‌లు వరల్డ్ కప్‌లో భాగం కాకుంటే మాత్రం బాగోదని తన అభిప్రాయం వెల్లడించాడు.

"ఒక అఫ్గానిస్థాన్ ఆటగాడిగా... రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భారత జట్టులో లేకుంటే నేను ఆనందపడతా. వారు టీమ్‌ఇండియాలో ఉంటే... ఆ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారిద్దరూ లెజెండ్స్. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జట్టులో లేరు అని ఎవరూ చెప్పలేరు. నిజానికి వారు జట్టులో లేకుంటే... ప్రత్యర్థి జట్లు చాలా సంతోషపడతాయి,"



అని రహ్మనుల్లా గుర్బాజ్ అన్నారు.కోహ్లీ వ్యక్తిత్వంపై మాట్లాడిన గుర్బాజ్, తాను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు విరాట్ కోహ్లీ సాయం అడిగేవాడినని చెప్పాడు. "గత మూడు సంవత్సరాలుగా ఎప్పుడు నేను కాల్ చేసినా, మెసేజ్ చేసినా అతడు వెంటనే స్పందిస్తున్నాడు. ఇటీవలే నేను పరుగులు సాధించలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు అతన్ని సంప్రదించా. ఆ తర్వాతి మ్యాచ్‌లో నేను 90 పరుగులు స్కోర్ చేశా. కోహ్లీ చాలా సింపుల్ వ్యక్తి. అతడు దేన్నీ క్లిష్టంగా మార్చడు. అతడు హార్డ్ వర్క్ చేస్తాడు. అదే సమయంలో పనిని ఆస్వాదిస్తాడు. క్రికెట్‌లో అదే అవసరం. ఆటను ఆస్వాదించలేనప్పుడు మెరుగైన ప్రదర్శనలు చేయలేం," అని గుర్బాజ్ పేర్కొన్నాడు. రోహిత్, కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతూ, వన్డే వరల్డ్ కప్ 2027లో పాల్గొనడమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నారు.




## టీ20 ప్రపంచకప్-2026 కు
# రింకూ సింగ్ దూరం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టీమిండియా స్టార్ ప్లేయర్, ముఖ్యమైన 'ఫినిషర్' రింకూ సింగ్‌ను టీ20 ప్రపంచకప్2026 ప్రణాళికల నుంచి పక్కన పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. దక్షిణాఫ్రికాతో జరిగే టీ20 సిరీస్‌కు ప్రకటించిన జట్టులో రింకూ పేరు లేకపోవడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. గాయం నుంచి కోలుకున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టులోకి తిరిగి రావడంతోనే రింకూకు స్థానం దక్కలేదని భావిస్తున్నారు. రింకూ గతంలో జట్టుతో ఉన్నప్పటికీ, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఆల్‌రౌండర్ల వైపు మొగ్గు చూపడంతో తుది జట్టులో ఎక్కువగా చోటు దక్కించుకోలేకపోయాడు. ముఖ్యంగా భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఈ మెగా ఈవెంట్‌లో స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ, బౌలింగ్ చేయగలిగే వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే వంటి ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే రింకూను పక్కన పెట్టి ఉంటారని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఏఐ యుగంలో
# 'ఈక్యూ'నే కీలకం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పనులను ఎక్కువగా నిర్వహిస్తున్నందున, ఉద్యోగ ప్రపంచంలో భావోద్వేగ మేధ (ఈక్యూ), సాంప్రదాయ మేధ (ఐక్యూ) మరింత కీలకమవుతున్నాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఇటీవల యాక్సెల్ స్ప్రింగర్ సీఈఓ మాథియాస్ డాఫ్నర్‌తో జరిగిన 'ఎండీ మీట్స్' పోడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, నాయకులకు కేవలం ఐక్యూ ఉంటే సరిపోదని, సమగ్ర నాయకత్వానికి ఈక్యూ తోపాటు ఐక్యూ అవసరమని అభిప్రాయపడ్డారు. ఏఐ ఆధారిత ప్రపంచంలో మానవ సహకారం, సంబంధాలు మరింత ప్రాముఖ్యత సంతరించుకుంటాయని, సాఫ్ట్ స్కిల్స్ వ్యాపారంలో ఒక సూపర్ పవర్‌గా మారుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఏఐ రేసులో మెరుగైన పోటీ కోసం మైక్రోసాఫ్ట్ నాయకత్వంలో అనేక కీలక మార్పులు చేసిన నాదెళ్ల, క్లౌడ్ కంప్యూటింగ్‌లో విజయం సాధించడానికి క్లౌడ్ ఎక్స్ పర్ట్ రోల్ఫ్ హార్మ్స్ ను ఏఐ ఎకనామిక్స్ అడ్వైజర్‌గా నియమించారు. ప్రస్తుతం ఆయన పూర్తిగా ఏఐ టెక్నికల్ అంశాలపై దృష్టి పెడుతూ, ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) వైపు కంపెనీని నడిపిస్తున్నారు.

# సుప్రీంకోర్టు కు అనిల్ అంబానీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రిలయన్స్ అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ బాంబే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన వ్యక్తిగత ఖాతాలు, రిలయన్స్ కమ్యూనికేషన్స్ లోన్ ఖాతాలను 'ఫ్రాడ్'గా వర్గీకరించిన నిర్ణయాన్ని సమర్థించిన బాంబే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అంబానీ సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ అప్పీల్ గత వారం చివరలో దాఖలు అయినప్పటికీ, కేసు ఇంకా అత్యున్నత న్యాయస్థానంలో విచారణకు రాలేదని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జూన్‌లో ఎస్‌బీఐ ఆర్‌కామ్ లోన్ ఖాతాలను 'ఫ్రాడ్'గా గుర్తించింది, రుణ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిధుల దుర్వినియోగం జరిగిందని పేర్కొంది, దీని వల్ల బ్యాంకుకు రూ.2,929.05 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. అనిల్ అంబానీ, ఎస్‌బీఐ సహజ న్యాయ సూత్రాలను పాటించలేదని, విచారణ అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసు




కున్నట్టుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 3, 2025న బాంబే హైకోర్టు, జస్టిస్ రేవతీ మోహిటే డేరే, నీలా గోఖలే డివిజన్ బెంచ్ అంబానీ పిటిషన్‌ను తిరస్కరించింది, ఎస్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాస్టర్ డైరెక్షన్స్ ను పాటించిందని, అంబానీ కంపెనీ ప్రమోటర్‌గా, కంట్రోలింగ్ పర్సన్‌గా ఫలితాలను ఎదుర్కోవాల్సిందేనని తీర్పు ఇచ్చింది. ఎస్‌బీఐతో పాటు ఐడీబీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా ఆర్‌కామ్ ఖాతాలను 'ఫ్రాడ్'గా వర్గీకరించాయి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెప్టెంబర్ 2025లో రూ.400 కోట్లకు సంబంధించిన ఆరోపణలపై షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఎస్‌బీఐ ఫిర్యాదు ఆధారంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఆగస్టు 21, 2025న కేసు నమోదు చేసి, రూ.2,929 కోట్ల మోసానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆర్‌కామ్, అంబానీ నివాసం సహా పలు ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సెప్టెంబర్ 2025లో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (PMLA) కింద కేసు నమోదు చేసింది. నవంబర్ 2025లో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (SFIO) కూడా నిధుల మళ్లింపు, గవర్నెన్స్ లోపాలపై విచారణ ప్రారంభించింది.

# సిబిల్ స్కోర్ ఇలా పెంచుకోండి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

జీవితంలో అప్పు చేయని వారుండరు. కానీ అప్పు అంత ఈజీగా పుట్టదు. మంచి క్రెడిట్ స్కోర్ ఉంటేనే మీకు బ్యాంకులు సులభంగా, తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు మంజూరు చేస్తాయి. దీనికోసం సిబిల్ స్కోర్ అనేది ముఖ్యమైన అంశం. బ్యాంకులు ఈ స్కోరును బట్టే మీ అప్పు తీర్చే సామర్థ్యాన్ని అంచనా వేస్తాయి. ఈ స్కోర్ తక్కువగా ఉంటే లోన్స్ ఇచ్చినా అధిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొందరికి క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటుంది. కొన్ని చిట్కాలు పాటిస్తే మీ స్కోర్‌ను ఈజీగా పెంచుకోవచ్చు.




- మీ అన్ని బిల్లులను సకాలంలో చెల్లించడం చాలా ముఖ్యం. ఆలస్య చెల్లింపులు మీ స్కోర్‌ను తీవ్రంగా తగ్గిస్తాయి.దీని కోసం మీరు మీ ఫోన్‌లో రిమైండర్లను సెట్ చేసుకోవచ్చు లేదా బ్యాంకులో ఆటో పే ఎంపికను ఉపయోగించడం ఉత్తమం.
- మీ క్రెడిట్ కార్డుపై ఉన్న మొత్తం పరిమితిలో మీరు ఎంత డబ్బును ఉపయోగిస్తున్నారనేది చాలా ముఖ్యం. దీనిని క్రెడిట్ వినియోగ నిష్పత్తి అంటారు. మీరు మీ పరిమితిలో 30శాతం కంటే తక్కువ మాత్రమే ఉపయోగించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.
- మీ క్రెడిట్ పరిమితి రూ.1 లక్ష అయితే మీరు రూ.30,000 కంటే ఎక్కువ ఉపయోగించకూడదు. తక్కువ వినియోగం అంటే మీరు బాధ్యతాయుతంగా ఖర్చు చేస్తున్నారని రుణదాతలకు చూపిస్తుంది.
- మీ రుణాలలో మంచి లోన్స్ ఉండేలా చూసుకోవాలి. సెక్యూర్డ్ లోన్స్, అన్ సెక్యూర్డ్ లోన్స్ రెండూ కలిగి ఉండటం ముఖ్యం. మీరు వివిధ రకాల రుణాలను బాధ్యతాయుతంగా నిర్వహించగలరని ఇది చూపిస్తుంది. ఇది స్కోర్‌ను పెంచడంలో సహాయపడుతుంది.
- మీరు తరచుగా కొత్త లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మీ క్రెడిట్ నివేదికపై ఎంక్వైరీ చేస్తారు. అవసరమైనప్పుడు మాత్రమే దరఖాస్తు చేసుకోండి. తరచుగా చేసే దరఖాస్తులు మీ ఆర్థిక పరిస్థితి సరిగా లేదనే సందేశాన్ని పంపి స్కోర్‌ను తగ్గిస్తాయి.
- ప్రతి నెలా లేదా కనీసం మూడు నెలలకు ఒకసారి మీ క్రెడిట్ నివేదికను తనిఖీ చేయడం అలవాటు చేసుకోండి.
- మీ క్రెడిట్ స్కోర్ లో ఏదైనా తప్పుడు సమాచారం లేదా మీకు తెలియని నకిలీ ఖాతాలను గుర్తిస్తే వాటిని వెంటనే సిబిల్ సంస్థకు ఫిర్యాదు చేసి సరి చేయండి. సరైన, పారదర్శకమైన సమాచారం కలిగి ఉండటం వల్ల మీ స్కోర్ పెరుగుతుంది.




## భారత్ - దక్షిణాఫ్రికా టీ20
# సిరీస్ కోసం జట్టు ప్రకటన

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ -దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, గాయం కారణంగా కొంతకాలంగా జట్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్‌ను ఫిట్నెస్ ఆధారంగా నామమాత్రంగా స్క్వాడ్‌లో చేర్చారు. మరో రెండు రోజుల్లో గిల్ ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత రానుంది. వికెట్‌కీపర్‌లుగా జితేష్ శర్మ, సంజు శాంసన్‌లు సిద్ధమయ్యారు. ఆసియా కప్‌లో గాయం కారణంగా జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌తో తిరిగి అడుగుపెడుతున్నాడు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా రీఎంట్రీ ఇవ్వగా, అర్ష్ దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, శివమ్ దూబే, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్‌లతో సమతుల్యమైన జట్టును బీసీసీఐ ఎంపిక చేసింది.

## రిటైర్మెంట్ ప్రకటించిన
# మోహిత్ శర్మ



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత మాజీ పేసర్ మోహిత్ శర్మ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు . తనకు మద్దతుగా నిలిచిన బీసీసీఐ, హరియాణా క్రికెట్ అసోసియేషన్, సహచర ఆటగాళ్లు, ఐపీఎల్ ఫ్రాంఛైజీలు, సహాయక సిబ్బంది, కుటుంబసభ్యులు, స్నేహితులకు మోహిత్ కృతజ్ఞతలు తెలిపారు. ఐపీఎల్ 2013లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడి 15 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు పడగొట్టడం ద్వారా ఆయన భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నారు. 2015 వరల్డ్ కప్‌లో అవకాశం రావడంతో, ఆ టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టారు. మొత్తం మీద భారత్ తరఫున 26 వన్డేలు ఆడి 31 వికెట్లు, ఎనిమిది టీ20లు ఆడి 6 వికెట్లు పడగొట్టారు. మోహిత్ శర్మ ఐపీఎల్ ప్రదర్శన గురించి వివరాలు కావాలా?



## టీమిండియా
# కొత్త జెర్సీ విడుదల

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టీ20 ప్రపంచకప్2026 కోసం టీమిండియా కొత్త జెర్సీని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారికంగా విడుదల చేసింది. రాయ్‌పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డే సందర్భంగా షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా, వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లాతో పాటు స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, తిలక్ వర్మలు కొత్త జెర్సీ కిట్‌లలో ఫోటోలకు పోజులిచ్చారు. భారత్, శ్రీలంక వేదికగా జరిగే ఈ మెగా ఈవెంట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా రోహిత్ శర్మ ఎంపికయ్యాడు. ఈ జెర్సీ భారత జెండాలోని మూడు రంగుల కలయికతో రూపొందించబడింది: ఎక్కువగా ముదురు నీలం రంగు ఉండగా, ఇరువైపులా ఆరెంజ్ రంగు, కాలర్ దగ్గరలో తెలుపు రంగు ఉన్నాయి. జెర్సీ మధ్యలో స్పాన్సర్ 'అపోలో టైర్స్' పేరుతో పాటు 'ఇండియా' అని ముద్రించారు.




## వివాదాలతో
# 'సంచార్ సాథీ' సూపర్ హిట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారతీయుల మైండ్ సెట్ మరోసారి వైరల్ అయ్యింది. వివాదాలు నెలకొన్న సినిమా సూపర్ హిట్ అయినట్లు ఇటీవల కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సంచార్ సాథీ యాప్ కూడా వివాదాలతో సూపర్ హిట్ అయ్యింది. ఈ యాప్ పై విపక్షాలు స్నూపింగ్ యాప్ గా విమర్శలు కురిపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో ఒక్కసారిగా యాప్ డౌన్ లోడ్స్ బాగా పెరిగాయి. గతంలో రోజుకు 60 వేల మంది ఇన్ స్టాల్ చేసుకుంటే ఇప్పుడు హఠాత్తుగా 10 రెట్లు పెరిగి రోజుకు 6 లక్షల మంది ఇన్ స్టాల్ చేసుకుంటున్నట్లు సమాచారం. నవంబర్ 28న కేంద్రప్రభుత్వం ఈ యాప్ ను కొత్త మొబైల్స్ లో ముందుగానే ఇన్ స్టాల్ చేసి ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఇది కుట్ర అని, వ్యక్తుల వ్యక్తిగత జీవితాల్లోకి ప్రభుత్వం తొంగి చూస్తోందని విపక్షాలు ఆందోళన చేశాయి. దీనితో ఈ యాప్ ద్వారా మోసపూరిత సైబర్ నేరాలు ముందుగానే గుర్తించవచ్చని, ఎలాంటి స్నూపింగ్ జరగదని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఇప్పటి వరకూ ఈ యాప్ ద్వారా 20 లక్షల చోరీకి గురైన ఫోన్లను గుర్తించామని తెలిపారు. అలాగే ఫోన్ సిమ్ మార్చినా పని చేయకుండా ఉంటుందని చెప్పడంతో యాప్ డౌన్ లోడ్స్ భారీగా పెరిగిపోయాయి.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
04.12.2025
www.manasarkar.com



## ఆ వార్తలు

# నిజం కావు..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

''శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నుండి రాబోయే సినిమాల గురించి ఈ మధ్య రకరకాల పుకార్లు వినిపిస్తున్నాయి. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవని, వాటిలో నిజం లేదని మేము తెలియజేస్తున్నాము" అన్నారు నిర్మాత దిల్ రాజు. "ఎప్పుడో వచ్చిన పాత ఊహాగానాలకు, ఇప్పటి విషయాలకు కొంత మంది ఇప్పుడు ముడిపెట్టి తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం మేము అక్షయ్ కుమార్ హీరోగా, అనీస్ బాజ్మీ దర్శకత్వంలో ఒక సినిమాను ప్లాన్ చేస్తున్నాము. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మేమే అధికారికంగా ప్రకటిస్తాము. దయచేసి అప్పటి వరకు మా నుండి అధికారిక సమాచారం వచ్చేదాకా ఎలాంటి నిర్ధారణలకు రావొద్దని, ధృవీకరించని వార్తలను మీ గౌరవ మీడియా లో ప్రచారం చేయవద్దని మీడియా మిత్రులను కోరుతున్నాము" అని దిల్ రాజు తెలియజేశారు.



## 2న స్టార్ హీరో కార్తి

# అన్నగారు వస్తారు

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

స్టార్ హీరో కార్తి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ "వా వాతియార్" తెలుగు ప్రేక్షకుల ముందుకు "అన్నగారు వస్తారు" టైటిల్ తో రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా రిలీజ్ డేట్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. "అన్నగారు వస్తారు" సినిమాను ఈ నెల 12న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ స్టూడియో గ్రీన్ బ్యానర్ లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా "అన్నగారు వస్తారు" రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ తో పాటు ఈ చిత్రం నుంచి 'అన్నగారు' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ ను సంతోష్ నారాయణన్ ఛాట్ బస్టర్ ట్యూన్ తో కంపోజ్ చేయగా, రాకేందు మౌళి క్యాచీ లిరిక్స్ అందించారు. ఎస్.పి.అభిషేక్, హరిప్రియ ఎనర్జిటిక్ గా పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే 'అన్నగారు, అన్నగారు..ఆల్‌రెడీ నే రిచ్ కిడ్డు, పాన్ ఇండియా మూవీ ప్లాన్ చేశా, రాజమౌళికి ఫోన్ చేసి నా మీద బయోపిక్ ఒకటి తీయమంటున్న..' అంటూ కలర్ ఫుల్ మేకింగ్ తో ఆకట్టుకుంటోంది పాట.



## సమంత వెడ్డింగ్ రింగ్

# విలువెంతో తెలుసా?

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

స్టార్ హీరోయిన్ సమంత, బాలీవుడ్ డైరెక్టర్ రాజ్‌నిడుమోరు భూతశుద్ధి వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ పెళ్లి ఫొటోలను స్వయంగా సమంత సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి బాగా వైరల్ అయ్యాయి. అయితే ఈ ఫొటోలలో సమంత ధరించిన కాస్ట్యూమ్ తోపాటు ఆమె వేలికి ఉన్న వెడ్డింగ్ రింగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ వెడ్డింగ్ రింగ్ ప్రత్యేకతను తాజాగా ఓ జ్యువెలరీ వ్యాపారి బయటపెట్టారు. ఈ ఉంగరానికి చాలా పెద్ద చరిత్రే ఉందని వివరించారు. మొఘలుల కాలంలో తొలిసారి ఈ రకమైన డిజైన్ తో ఉంగరం తయారుచేశారని పేర్కొన్నారు. పోర్ట్రెయిట్ కట్ గా పిలిచే ఈ డిజైన్ ను స్వచ్ఛమైన స్వభావానికి చిహ్నంగా భావిస్తారని తెలిపారు. మొఘల్ చక్రవర్తి షాజహాన్ భార్య ముంతాజ్ కు ఈ డిజైన్ ఉంగరాలంటే చాలా ఇష్టమని చరిత్రకారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. పోర్ట్రెయిట్ కట్ రింగ్ తయారీ కోసం వజ్రాన్ని ప్రత్యేక విధానంలో కట్ చేసి పలుచని గాజు పలకలా తయారుచేస్తారని జ్యువెలరీ వ్యాపారి చెప్పారు. ఈ రకమైన ఉంగరాలను అరుదుగా తయారుచేస్తారని పేర్కొన్నారు. సమంత వెడ్డింగ్ రింగ్ సుమారు రూ.1.5 కోట్లు విలువ చేస్తుందని తెలిపారు.

## 'ఆంధ్ర కింగ్ తాలూకా'

# సక్సెస్ సెలబ్రేషన్స్



**ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్-స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషించారు. ఈ చిత్రం నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తో హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా థాంక్ యూ మీట్ ని నిర్వహించారు. ఈ సందర్బంగా హీరో రామ్ పోతినేని మాట్లాడుతూ...**

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

అందరికీ హాయ్. రివ్యూవర్స్ కి థాంక్స్ చెప్పాలి. చాలా ఏళ్ల తర్వాత చాలా మంచి పాజిటివ్ రివ్యూస్ వచ్చాయి. సినిమా మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది చాలా బ్యూటిఫుల్ సినిమా. ఎక్కువ మంది జనాలు చూడాలనే మైండ్ సెట్ తోనే తీసాం. కొన్ని పరిస్థితుల వల్ల నవంబర్ ఎండ్ లో రిలీజ్ చేయాల్సి వచ్చింది. అయితే మాకు ఆడియన్స్ మీద పూర్తి నమ్మకం ఉంది. ఎప్పుడు చేయనంతగా సినిమాని ప్రమోట్ చేశాం. ఎందుకంటే నాకు అంత పర్సనల్ కనెక్షన్ ఉంది, ఇప్పటివరకు చాలా ఎమోషన్స్ చూశాం. కానీ స్టార్ అండ్ ఫ్యాన్ కు మధ్య ఉన్న ఎమోషన్ చెబుతూ, హ్యూమన్ ఎమోషన్ కూడా టచ్ చేసిన సినిమా ఇది. ఇలాంటి ఎమోషన్ ప్రపంచంలో ఎక్కడా లేదు. మన తెలుగు సినిమాకే సొంతం. ఒక సినిమా చేస్తున్నప్పుడు హిట్టా ఫ్లాపా అనేది అనే భయమేస్తుంది. కానీ ఈ సినిమా చేసినప్పుడు మాత్రం ఇది మంచి సినిమా అని వెంటనే తెలుసుకుంటారా కొంచెం లేటుగా తెలుసుకుంటారా అనేది చూడాలని అనిపించింది. రెగ్యులర్ కమర్షియల్ సినిమా లాగా మొదటి రోజే కొట్టేయాలనే ప్లానింగ్ లో లేము. ఫస్ట్ వీక్ స్లోగా ఉంటుంది, నెమ్మది నెమ్మదిగా పిక్ అప్ అవుతుందని నమ్మకంతో తీసిన సినిమా. ఈ సినిమాని మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆడియన్స్ నుంచే రెస్పాన్స్ వస్తుంది. టిఎఫ్ఐ ఫెయిల్ అయ్యిందనే మాట కూడా వినిపిస్తుంది. కానీ నేను నమ్మేదేంటంటే టిఎఫ్ఐ ఎప్పుడు కూడా ఫెయిల్ అవ్వదు. మనం సినిమా లవర్స్ మంచి సినిమాకి గుర్తింపు వస్తూనే ఉంటుంది. సినిమా పదిమంది చూస్తే 9 మందికి నచ్చింది. అన్ సీజన్ వల్ల పదిమంది చూశారు. ఈ సినిమాకి లాంగ్ రన్ ఉంటుంది అని నమ్ముతున్నా. 100 మంది చూస్తే 90మందికి నచ్చుతుందని నమ్మకంతో ఉన్నాం. నవంబర్ అయిపోయింది. ఎక్కువ మందికి ఎక్స్ పీరియన్స్ ఇవ్వాలని మా ఉద్దేశం. మరింత మంది వచ్చి సినిమా చూడాలని కోరుకుంటున్నాం. ఒక హానెస్ట్ సినిమా తీయడానికి ధైర్యాన్ని ఇచ్చిన సినిమా ఇది. వివేక్ మర్విన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో అండర్ కరెంట్ గా అద్భుతమైన మెసేజ్ ఉంది మంచి స్ఫూర్తితో బయటికి వచ్చే కంటెంట్ ఉంది. పదిమందిలో తొమ్మిది మంది అది ఫీలయ్యారు. నాకు సినిమా గురించి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వస్తూనే ఉంది. చాలా మెసేజ్లు వచ్చాయి మహేష్ హానెస్ట్ ఫిలిం మేకర్. తెలుగు సినిమాకి మహేష్ లాంటి ఫిలిం మేకర్స్ కావాలి. భాగ్యశ్రీ గ్లామర్ గా కనిపిస్తూనే అద్భుతమైన పర్ఫామెన్స్ ఇస్తుంది. ప్రమోషన్స్ లో కూడా చాలా సపోర్ట్ చేసింది. ఆంధ్ర కింగ్ తాలూకా మనసుకు చాలా దగ్గరైన సినిమా. సెకండ్ వీక్ అద్భుతంగా ఉండబోతుంది. ఇంకా ఎక్కువ మంది సినిమా చూసి ఒక మంచి అనుభూతిని పొందుతారని నమ్మకం ఉంది. తెలుగు సినిమా లవర్స్ అందరు కూడా ఈ సినిమాకి వచ్చి ఈ ఎమోషన్ ని ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను. హీరోయిన్ భాగ్యశ్రీ మాట్లాడుతూ.. అద్భుతమైన సినిమా తీసిన మా టీమ్ అందరికీ థాంక్యూ. మహాలక్ష్మి క్యారెక్టర్ చేసినందుకు చాలా ప్రౌడ్ గా ఫీల్ అవుతున్నాను. అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తప్పకుండా ఈ సినిమాని మరింత మంది చూస్తారని కోరుకుంటున్నాను. మైత్రి ప్రొడ్యూసర్ రవి , డైరెక్టర్ మహేష్ బాబు, మ్యూజిక్ డైరెక్టర్స్ వివేక్, మర్విన్ మాట్లాడుతూ.. ఆంధ్ర కింగ్ తాలూకా అందరం కలిసి చాలా ప్రేమించి చేసిన సినిమా. మేము ఏదైతే ఆశించామో అన్ని మాకు వచ్చాయి. సినిమా గురించి మీడియా మిత్రులు చాలా అద్భుతంగా రాశారు. థియేటర్స్ విజిట్ చేస్తాం. అభిమానుల్ని కలుసుకుంటాం. ఇది చాలా మంచి సినిమా.

# 'గోట్' నుంచి అదిరిపోయే టీజర్!

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

జైశ్వవ్ ప్రొడక్షన్ , మాహాతేజ క్రియేషన్స్ లో అద్భుతం, టెనంట్ వంటి అద్భుతమైన చిత్రాలని నిర్మించిన మొగుళ్ళ చంద్రశేఖర్ నిర్మాణంలో... క్రికెట్ నేపథ్యం లోనే కామెడీ ప్రధాన అంశంగా సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన మూవీ 'గోట్' ఇప్పటికే విడుదల చేసిన పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ అదిరిపోయే టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరోయిన్ దివ్యభారతి మాట్లాడుతూ... మీ అందరి సపోర్ట్ కి థాంక్యూ. తమిళ్ లో నాకు బ్యాచిలర్ ఎంత మంచి పేరు తీసుకొచ్చిందో తెలుగులో 'గోట్' సినిమా అంతా పేరు తీసుకొస్తుందని నమ్ముతున్నాను. కథ విన్నప్పుడు ఫుల్ కామెడీ నవ్వుతూనే ఉన్నాను తెలుగులో సినిమా చేస్తే ఇలానే ఉండాలనిపించింది. బ్యాచిలర్ సినిమాకి తెలుగు ఆడియన్స్ కూడా చాలా సపోర్ట్ ఇచ్చారు. తెలుగులో ఒక ప్రాజెక్ట్ చేస్తున్నప్పుడు అది మంచిగా ఉండాలని నా ప్రయత్నం. అందుకే ఈ సినిమా చేశాను. అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సుధీర్ గారు మల్టీ టాలెంటెడ్ ఆయనతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. మా నిర్మాతలు చాలా సపోర్ట్ చేశారు. వాళ్లకి సినిమా అంటే చాలా పాషన్. ఒక ప్రాజెక్ట్ తీసుకుంటే చాలా అంకితభావంతో పని చేస్తాము పాటలకి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను. యాక్టర్ నితిన్ ప్రసన్న మాట్లాడుతూ... ఈ సినిమా కథ విన్నప్పుడు చాలా నచ్చింది. కథ విన్నప్పుడే లుక్ టెస్ట్ కూడా చేసేసారు. అన్నీ చాలా ఫాస్ట్ గా మొదలయ్యాయి. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నా క్యారెక్టర్ చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. చాలా మంచి టీం వర్క్ తో ఈ సినిమా చేసాము.





## 'సైక్ సిద్ధార్థ'

# ట్రైలర్ లాంచ్

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్‌స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థ లో హై ఎనర్జీ ఎంటర్‌టైన్‌మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో శ్రీ నందు మాట్లాడుతూ.. చాలా ఎమోషనల్ గా ఉంది. ఇదంతా ఒక టీం జర్నీ. డైరెక్టర్ వరుణ్ ఆర్కిటెక్చర్ ఆ ఫీల్డ్ లో గోల్డ్ మెడల్స్ వచ్చాయి. తనకి ఫిలిం మేకింగ్ అంటే ప్యాషన్. అన్నపూర్ణ స్టూడెంట్. రామనాయుడులో డెబ్యు చేస్తున్నాడు. నాకు రైటింగ్, డైరెక్షన్ మీద మొదటి నుంచే ఆసక్తి ఉంది. కొన్ని మ్యూజిక్ వీడియోస్ కి డైరెక్షన్ చేశా. బ్రోచేవారు బ్యానర్‌లో నాకు డైరెక్టర్ గా ఒక సినిమా ఓకే అయింది. అప్పుడే ఒక రైటర్ కావాలంటే వరుణ్ పరిచయమయ్యాడు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్టు ఆగిపోయింది .ఆ జర్నీలో మా ఇద్దరి మధ్య ఒక నమ్మకం వచ్చింది. నిజానికి ఈ సినిమా ఒక డెమో లాగా షూట్ చేశాడు. దానికి ఒక ఓటీటీ సంస్థ నుంచి ఆఫర్ కూడా వచ్చింది. అయితే ఇది మంచి స్కేల్లో ఇంకా చాలామందికి రీచ్ కావాల్సిన కథ అని చెప్పను. ఆ తర్వాత మేమే ఈ సినిమాని చేయాలనుకుని నిర్ణయించుకున్నాం. వరుణ్ నా నమ్మకాలు నిలబెట్టుకున్నాడు. ఈ సినిమాకి మీలాంటి యువకుడి కథ అనే టాగ్‌లైన్ పెట్టాం. ఈ కథ కూడా ఇప్పుడున్న సొసైటీకి రిలేట్ అయ్యేలాగా యూత్ కి కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. లెజెండ్రీ రాఘవేంద్రరావు, డైరెక్టర్ సాయి రాజేష్, అనుదీప్ ఈ సినిమా చూసి చాలా అభినందించారు. సురేష్ బాబు చూసి వెంటనే సైన్ చేశారు. నిర్మాతగా నేను ప్రాఫిట్ లో ఉన్నాను. ఈ సినిమాని తీసుకున్న సురేష్ బాబు కూడా చాలా హ్యాపీగా ఉన్నారు. ఇది టేబుల్ ప్రాఫిట్ ఫిలిం. పెళ్లిచూపులు సినిమాలో సెకండ్ లీడ్ గా చేశాను. ఆ సినిమా సక్సెస్ సమయంలోనే నాకు ఇలాంటి ఒక రోజు రావాలని బలంగా కోరుకున్నాను. ఈరోజు సురేష్ ప్రొడక్షన్స్ ఈ సినిమాని తీసుకోవడం నా డ్రీమ్ నెరవేరినట్లుగా అనిపించింది. నా కెరీర్ కి ఇది బంగారు బాట లాంటి సినిమా అవుతుంది. మీరందరూ నా జర్నీ చూస్తున్నారు. నేను ఈరోజు ఎమోషనల్ అయ్యాను. సినిమా చూసిన తర్వాత మీరు ఎమోషనల్ నన్ను హగ్ చేసుకునే రోజు డిసెంబర్ 12 అవుతుందని నేను నమ్ముతున్నాను. డైరెక్టర్ వరుణ్ రెడ్డి , హీరోయిన్ యామిని భాస్కర్ మాట్లాడుతూ... చాలా గ్యాప్ తర్వాత నా సినిమా రిలీజ్ అవుతోంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాం. తప్పకుండా అందరూ చూసి మమ్మల్ని సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం అన్నారు.

## హాస్యభరితమైన కథ

# అనుమాన పక్షి

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

'డీజే టిల్లు'తో బ్లాక్ బస్టర్ డెబ్యు చేసిన రచయితదర్శకుడు విమల్ కృష్ణ, ఇప్పుడు యంగ్ ట్యాలెంటెడ్ రాగ్ మయూర్ హీరో గా చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్ లో హిలేరియస్ ఎంటర్ టైనర్ 'అనుమాన పక్షి' మూవీ డైరెక్ట్ చేస్తున్నారు. నిర్మాతలు రాజీవ్ చిలకా, రాజేష్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. మెరిన్ ఫిలిప్ కథానాయిక. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేశాయి. మేకర్స్ ఇప్పుడు రాగ్ మయూర్ పాత్ర ద్వారా సినిమా రిలీజ్ టైంని వెల్లడించే ప్రమోషనల్ వీడియోను విడుదల చేశారు. ఈ ప్రోమోలో రాగ్ మయూర్ అనుమాన పక్షిగా పరిచయం అయ్యారు. అతిగా ఆలోచించడం, అతిగా జాగ్రత్తగా ఉండే స్వభావంతో తన చుట్టూ ఉన్నవారిని గందరగోళపరిచే విచిత్రమైన క్యారెక్టర్ ఆకట్టుకుంది. ప్రోమోతో పాటు, చిత్ర ప్రచార కార్యక్రమాలు త్వరలో ప్రారంభమవుతాయని, ఫిబ్రవరిలో సినిమా విడుదల కానుందని తెలియజేశారు. ఖచ్చితమైన తేదీని త్వరలో అనౌన్స్ చేస్తారు. బలమైన పాత్రలతో అలరించే దర్శకుడు విమల్ కృష్ణ, ప్రత్యేకంగా రాగ్ మయూర్ కోసం రూపొందించిన యూనిక్ క్యారెక్టర్ తో వస్తున్నారు. అతని సిగ్నేచర్ స్టైల్, హాస్యభరితమైన కథ ప్రమోషనల్ వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంది.



## యూట్యూబ్ నుంచి

# వెండితెరకు..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

ఇప్పుడు ఎక్కడ చూసినా.. ఏ నోటా విన్నా 'రాజు వెడ్స్ రాంబాయి' గురించే చర్చంతా. అఖిల్ రాజ్ ఉద్దెమరి, తేజస్వీ రావు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కింది. ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. అది 2010. ఒక మారుమూల గ్రామంలో బ్యాండ్ కొడుతూ జీవనం సాగించే యువకుడు రాజు (అఖిల్ రాజ్) అదే ఊరికి చెందిన అమ్మాయి రాంబాయి (తేజస్వి రావు)ని ఎంతో గాఢంగా ప్రేమిస్తాడు. కానీ రాజు తండ్రి రమేష్ (శివాజీ రాజా) తన కొడుకును హైదరాబాద్ పంపి వేరే పని ఏదో చేసుకోవాలని ఆశపడతారు. ఇంకోపక్క రాంబాయి తండ్రి వెంకన్న (చైతూ జొన్నలగడ్డ) తన కూతురికి కేవలం గవర్నమెంట్ సంబంధం చెయ్యాలని చూస్తాడు. ఈ క్రమంలో ప్రేమలో పడ్డ ఈ యువ జంట ప్రేమకథ ఎలా సాగింది? ఇద్దరికీ పెళ్లి ఎలా జరిగింది? ఆ మధ్యలో ఎదుర్కొన్న ఇబ్బందులు ఏంటి? తన సొంత కూతురుకే వెంకన్న తలపెట్టిన హాని ఏంటి? చివరికి వారి ప్రేమ కథ ఎలా ముగిసింది అనేది సినిమా కథ. ఈ సినిమాలో యువ హీరో హీరోయిన్స్ అఖిల్ రాజ్, తేజస్విలు రాజు, రాంబాయి అనే లవర్స్ లా జీవించారని చెప్పొచ్చు. ఒక మారుమూల గ్రామంలోని ఇన్నోసెంట్ లవర్స్ గా వీరి కెమిస్ట్రీ సినిమాలో బాగుంది. అలాగే ఫస్టాఫ్ లో ఇంకా క్లైమాక్స్ పోర్షన్ లో ఇద్దరి మధ్యలో సీన్స్ బాగున్నాయి. ఇక వీటితో పాటుగా అక్కడక్కడా వింటేజ్ కామెడీ సీన్స్ డీసెంట్ ఫన్ ని జెనరేట్ చేసాయి. ఎవరైతే నిజమైన ప్రేమని ఫీల్ అవుతారో, తమ ప్రేమ కోసం ఎంతవరకు అయినా వెళ్ళాలి అనుకుంటారో వారిని ఈ సినిమా మరింత కదిలిస్తుంది. ఇక ముఖ్యంగా చెప్పాలంటే.. ఇక్కడ మనం రాంబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన తేజస్వీ రావు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. యూట్యూబ్ నుంచి వెండితెరకు ఆమె సాగించిన ప్రయాణం ప్రతీ ఒక్కరినీ కదిలిస్తుంది. ఆమె తన కెరీర్‌ను ప్రధానంగా యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్.. వెబ్ సిరీస్‌ల ద్వారా ప్రారంభించారు. 2019లో వచ్చిన షార్ట్ ఫిల్మ్ 'పెళ్లిచూపులు ఫర్ ది 12th టైమ్; ద్వారా ఆమె నటించడం మొదలుపెట్టారు. చాలా మంది నటీమణులు సినిమాల నుండి డిజిటల్ స్పేస్‌కి వస్తే, ఈమె డిజిటల్ నుండి సినిమా రంగానికి వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 1993, జూలై 14న జన్మించిన ఈ చిన్నది అక్కడే నివసిస్తోంది. చాలా మంది నటీమణులు హైదరాబాద్‌లో స్థిరపడినా, ఆమె మాత్రం రాజమండ్రిని వదిలి వెళ్ళలేదు. ఆమె 'బావ మరదలు', 'అద్భుతం', 'సిక్సర్', 'చందమామ', 'ఓరి దేవుడా', 'కేరళ కుట్టి', 'నీలవేణి', 'నిశ్చితార్థం', 'సీతకళ్యాణం' వంటి అనేక వెబ్ సిరీస్‌లు.. షార్ట్ ఫిల్మ్స్‌లో నటించింది. సినిమా కంటే డిజిటల్ కంటెంట్‌లోనే ఆమె ఎక్కువ ప్రాజెక్టులు చేసింది. ఇప్పుడు టాలీవుడ్ లో ఈ అమ్మాయి పేరు మారు మోగిపోతోంది. మంచి మంచి అవకాశాలు తలుపుతడుతున్నాయి. కెరీర్ లో బిజీబిజీగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**